ENTERED

ప్రజాశక్తి
ఆదివారం అనుబంధం
13 మార్చి, 2011

అపర 'సంజీవని'

2011 హ్యాపీ బర్త్‌డే

(2011 మార్చి 13 నుంచి
2011 మార్చి 19 వరకు)

ఎ. కిరణ్మయి
9సం॥, మార్చి-13
నాగరాణి-సైదయ్య
త్రిపురారామం-నల్లగొండ

సనా సానియా
6సం॥, మార్చి-18
హసీనా-అన్వర్
దోమల్‌గూడ-హైదరాబాద్

జె. సృజన(చిన్నారి)
4సం॥, మార్చి-2007
సరిత-వెంకటేష్(జె.వి)
ధర్మన్నగూడ-రంగారెడ్డి

ఎ. హిమసాయి
2సం॥, మార్చి-2009
శ్రీలక్ష్మి-రాఘవ
నాయుడుగూడెం-ప॥గో

ఆదర్శ్
4సం॥, మార్చి-14
శృతి-శెందిల్‌కుమార్
న్యూయార్క్-అమెరికా

ప్రణవ్ రామ్-ప్రవంత్ లక్ష్మణ్
మార్చి-15
శ్రీమతి&శ్రీవెంకటరమణ
సబ్బవరం-విశాఖ

జి. కృపాకర్
9సం॥, మార్చి-2002
హన్నమ్మ-సుధాకర్
మారెళ్ల

సిహెచ్. చిన్నారి
3సం॥, మార్చి-14
కోటేశ్వరి-కొండలరావు
రామకృష్ణాపురం-ప్రకాశం

వి. దిలీప్‌కుమార్
మార్చి
జానకి-రవీందర్‌రెడ్డి
గణేష్‌నగర్‌కాలనీ-ఉప్పల్

వై. విజయ్-వరుణ్-దినేష్ డార్విన్
మార్చి-18
లావణ్య-గోపీకృష్ణ
శ్రీకాకుళం

యు. అచ్యుత్
మార్చి
నాగలక్ష్మి-వేణుబాబు
మక్కినవారిపాలెం-ప్రకాశం

మనలో మాట

ఏం ఎండలు!



ధరలు మండుతున్నాయి. ఇప్పుడు ధరలకు తోడు ఎండలూ వచ్చి చేరాయి. మార్చి మధ్యకైనా రాలేదు మంటెత్తిపోతోంది. పెరిగిన ధరలతో మార్కెట్లో కాలు పెట్టే పరిస్థితి లేదు. మండుతున్న ఎండలతో ఇల్లు విడిచి కాలు బయట పెట్టాలంటే భయం. మధ్యాహ్నాలు మరీ అదరకొట్టేస్తున్నాయి. ఇప్పడే ఇలా వుంటే ముందు ముందు ఎలా వుంటుందో.

ఇంట్లో వున్నా కొలిమిలో కూర్చున్నంత ఉక్కపోత ఉంటుందేమో. పోనీ అలా పార్కులోకెళ్లి కూర్చుందామంటే అదేదో ఆషామాషీ వ్యవహారంలా లేదు. పార్కులో ప్రవేశం కోసం జేబులు ఖాళీ చేసుకోవాల్సిందే. ప్రవేశభారం నుంచి మార్నింగ్ వాక్‌ను ప్రస్తుతానికి వదిలేసినా వేలాడుతున్న కత్తి ఎప్పుడైనా మెడమీద పడొచ్చు.

ప్రచండ భానుణ్ణి ఎదుర్కోడానికి అనాది నుంచి మనకి కొన్ని అస్త్రశస్త్రాలున్నాయి. అందులో అందరికీ అందుబాటులో వుండేది నిమ్మకాయ అస్త్రం. అది విఫలమైతే మజ్జిగ మంత్రం, కొబ్బరిబొండాం...చెరకుగడ గట్రా...గట్రా. అయితే ... అసలు సమస్యేమిటంటే కొత్త తరానికి ఇవన్నీ పాత చింతకాయ పచ్చళ్లు. తెల్లారిన దగ్గర నుంచి అర్థరాత్రి దాకా ఆ మాటకొస్తే ఇరవైనాల్గు గంటలు చానళ్లలో, ఎఫ్‌ఎం రేడియోల్లో నిర్విరామంగా కూల్ డ్రింక్‌ల ప్రచారం జరుగుతుంటే నిమ్మకాయల్నీ చెరుకుగడల్నీ పట్టించుకునేదెవ్వడు? మాటలు రాని పోరడు కూడా కూల్ డ్రింక్‌లకై మారాం చేస్తుంటే తలొగ్గేస్తున్నాం. ఏమార్చడానికో బామార్చడానికో ఓపికెక్కడ సచ్చింది కనుక.

★★★

అసలే ఎండలు. ఆపై ఎన్నికలు. మధ్యలో పరీక్షలు. ముప్పేట దాడి అంటే ఇదేనేమో! ఎండల తాపం, పరీక్షల భయం, ఎన్నికల కలకలం.. మూడూ మూడే. కూర్చోనివ్వవు. పండుకోనివ్వవు. వృద్ధులు-విద్యార్థులదో టెన్షన్. అభ్యర్థులదో అటెన్షన్.

★★★

ఎండాకాలంలో ఎండలు, వడగాలులు, ఉక్కపోతలేనా! మల్లెలు, ముంజెలు, మామిళ్లు కూడా వున్నాయండోయ్. పూల జల్ల ఊసులు విస్మరిస్తే ఎలా! మేడలూ మిద్దెలూ ఆకాశంలో చందమామ తెలిసొచ్చేది వేసవిలోనే కదా. నాలుగ్గోడల మధ్య నుంచి బయటపడి నక్షత్రాల్ని లెక్కెట్టేదప్పడే కదా. కళ్ల నిండా వెన్నెలమ్మను నింపుకునేది వేసవి రాత్రుళ్లలోనే కదా.

అయితే ఇవన్నీ ఇలాగే వుంటాయా? విషవాయువుల ధాటికి ఓజోన్ పొర ఛిద్రమైతే ఎలా? ప్రకృతి శక్తులను, భూగర్భ వనరులను కొందరికి లాభం కోసం విచ్చలవిడిగా వినియోగిస్తూ పోతే వాతావరణ సమతుల్యం నిలుస్తుందా? భూగోళం నానాటికి వేడెక్కుతోంది. అకాలవర్షాలూ, వచ్చిపడుతున్నాయి. ఇదంతా గ్లోబల్ వార్మింగ్ దుష్ప్రభావం అంటూ శాస్త్రజ్ఞులు నెత్తినోరు బాదుకొంటున్నారు. దీన్ని ఇలాగే వదిలేద్దామా? మహానాయకుడు ఫైడల్ కాస్ట్రో ఈ మధ్య ఓ హెచ్చరిక చేశాడు. మనిషికి మరో గ్రహం లేదని గుర్తు చేశాడు. ఎంత లోతైన మాట. ఈ భూమి మీద పుట్టిన ప్రతి వాడూ గుర్తుంచుకోవలసిన మాట. తన వంతు జాగ్రత్తలు తీసుకోవాల్సిన మాట.

★

ఈ సంచికలో....

టపా	...	2
చిన్నకథ	...	3
కవిత్వమ్	...	6
సినిమా కబుర్లు	...	8
నవ్వుల్ పువ్వుల్	...	10
కొత్త పుస్తకాలు	...	11
చూద్దామా	...	12
అట్టమీది కథ	...	14
తెల్సా	...	17
కథ	...	18
వికాసం	...	20
బాలనేస్తాలు	...	22
మాటలకోట	...	24

ఇంకా...

నింగి నేల నాదే ... 4



రుచి ... 7

యాపిల్ రసగుల్లా

ఈ పేజీ ... 21

మార్ఫింగ్ మేనియా



కథ కాదు...

'మనలో మాట'లో రెండు రకాల జైళ్ల గురించి చెప్పింది. మొదటి రకం జైలు గురించి చదివినప్పుడు త్యాగ పురుషులు కనిపించారు. రెండో రకంలో చరిత్ర హీనులు కనిపించారు. డేనియల్ సైన్సు మీద పూర్తి నమ్మకంతో కృత్రిమ కాలు పెట్టించుకుని తను అనుకున్నది సాధించుకుంది. వికలాంగులకు స్ఫూర్తినిచ్చే విషయాన్ని రచయిత్రి చరిత చెప్పారు. ఆఖరి పలుకులు చదివినప్పుడు మనమూ మనవారితో గుర్తుండిపోయేలా చివరి మాటలు మాట్లాడగలిగితే బావుండనిపించింది. రెంటాల జూనియర్ మణిశర్మని పరిచయం చేశారనేకంటే సంగీతం గురించిన సమాచారం అందించారనడం సబబు. సప్త స్వరాలతో సంగీత దర్శకుడు ఒక కొత్త బాణీని సృష్టించినప్పుడు ముందు తాను ఆనందించి, తర్వాత ప్రజలను పరవశింపచేస్తాడు. అందువల్ల సంగీత దర్శకుడు తానొక సృష్టికర్తగా జనాల్లో ఉండిపోతాడు. తెలకపల్లి రవిగారు రాసింది కథ కాదు. ప్రతి కార్యకర్తలో ఉండే దీక్ష. విజయవాడ వాసి అయిన నేను ఆయన్ని ఏ మీటింగులో చూసినా ఈ చిగురు కథేగుర్తొస్తుంది. యువతీ యువకులు కమ్యూనిస్టులు కావడం లేదనే వారికి ఈ కథ ద్వారా వాస్తవ దర్శనం కలుగుతుంది.

ఇలిపిల్ల సూర్యనారాయణ,
భీమనవారిపేట.

ఆచరించాల్సిన విషయాలు



అట్టమీది కథ 'సైన్స్‌దే అంతిమ విజయం' అందరూ పరిశీలించాల్సిన, ఆచరించాల్సిన నగ్న సత్యాలను వివరించింది. 'వికాసం' ద్వారా పిల్లలకు పరీక్షల వేళ యేపీ జాగ్రత్తలు చెప్పాలో వివరించారు. జీపీఆర్ఎస్ విషయంలో ఆటోమేటిక్‌గా ఎనేబుల్ అయ్యే ఫెసిలిటీ ఉన్న నోకియాను అభినందించలేకుండా ఉండలేం. 'బాలనేస్తాలు'లో నీటి మీద వలయాలు ఆసక్తికరంగా ఉంది. నడిచే అయస్కాంతాలు ఔరా అనిపించాయి. పొడవాటి కురులు వంటి విషయాలతో 'తెల్సా' పేజీ భలేగా ఉంటోంది. 'ఆఖరిపలుకులు' అంటూ ప్రముఖుల చివరి మాటలను మా ముందుంచే ప్రయత్నం అభినందనీయం. ఉన్నతోన్నతమైన భావపరంపరలతో కవిత్వం పేజీ అలరారుతోంది. 'సినిమా కబుర్లు' ద్వారా మణిశర్మ సంగతులెన్నో తెలుసుకునే అవకాశం కలిగింది. 'చూద్దామా'లో ప్రపంచ వారసత్వ సాంస్కృతిక సంపద గురించిన వ్యాసం బాగుంది. జరుగుబాటుంటే జ్వరమంత సుఖం లేదన్నట్లు సాగితే జైలుకు మించిన రక్షిత స్థలం లేనేలేదు.

నేమాన సుభాష్‌చంద్రబోస్,
శ్రీకాకుళం.

వింతగా ఉంది

అన్ని రంగాల్లో సైన్స్ అభివృద్ధి చెందినప్పటికీ అదే స్థాయిలో మూఢనమ్మకాలూ కొనసాగుతున్నాయి. సైంటిస్టులు సైతం మూఢనమ్మకాలు పాటించడం వింతగా ఉంది. చిల్లంగి, బాణామతి, చెడుపు పేర్లతో రాష్ట్రంలో ఏడాదికి 200 మందిదాకా బలవుతున్నారు. జోగిని వ్యవస్థ తెలంగాణా జిల్లాల్లో ఇంకా కొనసాగుతోంది. ప్రజల్లో శాస్త్రీయ విజ్ఞానాన్ని పెంపొందించడం ప్రతి పౌరుని బాధ్యత. అది ప్రభుత్వం కర్తవ్యమని చెపుతుంది. కానీ దీన్ని అమలు చేసే యంత్రాంగం లేదు. జనవిజ్ఞాన వేదిక సైన్స్‌ను ప్రచారం చేస్తూ మూఢనమ్మకాల నిర్మూలనకు కృషి చేస్తున్నందుకు అభినందనలు.



టి.శ్రీరామ్మూర్తి, గాజువాక.

అభినందనీయం

సైన్స్ డే సందర్భంగా 'స్నేహ'లో అట్టమీద కథగా 'సైన్స్‌దే అంతిమ విజయం' ప్రచురించడం అభినందనీయం. గత కొద్ది సంవత్సరాలుగా మూఢ నమ్మకాలతో ముడిపడ్డ అవాంఛనీయ సంఘటనలు అధికం కావడానికి గల కారణాలను వ్యాస రచయిత కె.ఎల్. కాంతారావు ప్రధాన కోణంతో, తగు ఆధారాలతో చక్కగా విశ్లేషించారు. శాస్త్ర సాంకేతిక రంగాల్లో అనూహ్య అభివృద్ధి జరుగుతున్నా, బలంగా నాటుకుపోయిన ప్రాచీన అంధవిశ్వాసాల చట్రం నుండి అనేక మంది బయట పడలేకపోతున్నారు. దీనికి ప్రయివేటీకరణ ప్రధానమైన కారణం. ప్రజల్ని శాస్త్రీయంగా ఆలోచించే చైతన్యవంతుల్ని చేయాలనే చిత్తశుద్ధి కొందరు ప్రభుత్వాధినేతల్లో లేకపోవడం మరో ముఖ్య కారణం. మీడియాలో కొన్ని వర్గాలు ప్రత్యేకంగా మూఢనమ్మకాలని పెంచిపోషించడం కూడా విచారకరం. అహేతుకతను చర్చిస్తూ మేధావులతో, నిపుణులతో ప్రత్యేక శీర్షికను (ఎవరి విశ్వాసాలనూ నిందించకుండా) ప్రవేశపెడితే చదువరులలో తార్కిక, శాస్త్రీయ వైఖరులు అలవాటవుతాయి.

భైరి సత్యనారాయణ, కొత్తగూడెం.

★

చిన్నకథ



కావేరికి ఏమైంది?!

కావేరిని చూస్తే అందరికీ ఆశ్చర్యమే. ఎందుకు? ఆమెది యాభైయేళ్ల వయసు. నిండైన రూపం. దబ్బపండు ఛాయ. కందిగింజంత బొట్టు, చిన్న ముడి. మెడలో ఉండీ లేనట్లు మెరిసే సన్నని గొలుసు హుందాతనాన్ని తీసుకొచ్చే నిండైన చీరలు. ముఖాన ప్రశాంతత, పెదాలపై చెరగని దరహాసం. “అన్నీ బాగానే వున్నాయే! మరింకేంటి అభ్యంతరం! అభ్యంతరం దేనికంటే, కావేరీ భర్త చనిపోయి ఆర్నెల్లే! అందరిలా కావేరి లేకపోవడం చూడలేకే! సాధారణంగా ఇలాంటి సమయాల్లో స్త్రీలు ఎలా వుండాలి? సర్వం కోల్పోయినట్లు, నెత్తిమీద నీటి కుండ పెట్టుకున్నట్లు, దిగాలుగా, విరాగిణిలా కనపడాలి... (కనీసం చూడగానే జాలి పుట్టాలిగా!) కదిలిస్తే భర్త మంచితనాన్ని కీర్తించాలి. బతుకు శూన్యమైపోయిందంటూ చూపరుల్లో సానుభూతి పుట్టించాలి. గుమ్మం దాటి అసలు బైటికి రానే కూడదు.

అలాంటిది కావేరి తగుదునమ్మా అంటూ ఆఫీసుకే వచ్చేస్తోంది. పైపెచ్చు ఏనాడో మరుగున పడిపోయిన అభిరుచులకు కొత్త రంగులు అద్దుతోంది. మొక్కలకు నీళ్లుపోసి, పాదులు పెడుతుంది. ఆదివారాలు బజారుకెళ్లి నచ్చిన పుస్తకాలు కొనుక్కుంటుంది. సాయంకాలాలు పెయింటింగ్ క్లాసులకు వెళ్తోంది. ఇవన్నీ ఆ నోటా ఈ నోటా కొడుక్కు, కూతురుకూ తెలియనే తెలిశాయి. కూడబలుక్కున్నట్లు ఒకేసారి దిగిపోయారు.

“అమ్మా! ఒంటరిగా ఇక్కడ ఉండకపోతే మా దగ్గరకు వచ్చెయ్యరాదా?” ఇద్దరం ఆఫీసుకు వెళ్లేవాళ్లమే. పిల్లల్ని చూసుకున్నట్లూ వుంటుంది. ఒక్కర్దానివీ ఇక్కడున్నావన్న బెంగా మాకుండదు” అంటున్న కొడుకు వంక చూస్తూ కావేరి నిర్మలంగా నవ్వింది.

“నా ఉద్యోగం, ఈ ఇల్లు వదిలి నేనెక్కడకూ రానర్రా” అంది. “అమ్మా! నీకే లోటూ రాకుండా చూసుకునే బాధ్యత నాదీ” కొడుకు అనునయించబోయాడు. “నాకు కావలసింది డబ్బులు కాదురా! ఏకాంతం” ... తల్లివంక ఆశ్చర్యంగా చూశారంతా!

“ఇదేం విడ్డూరమమ్మా! ఒంటరితనాన్ని ఇష్టపడుతున్నావా?” అంటూ కూతురు నివ్వెరపోతుంటే, “కాదూ మరీ! నచ్చిన బట్ట, కోరిన తిండీ” కోడలు దీర్ఘాలు తీసింది. కోడలి వంక నింపాదిగా చూస్తూనే, “అవునమ్మా! నువ్వన్నమాటే నిజం. మిగిలిన ఈ కొద్దిపాటి జీవితాన్నీ నాకు నచ్చినట్లు పూర్తిగా, పరిపూర్ణంగా అనుభవించాలనుకుంటున్నాను” అంది అందరి వంక చూస్తూ.

“నీ మనసులో ఏముందో మాకర్థం కావడం లేదమ్మా!” అని కొడుకంటే, “అంటే, నాన్న ఉన్నప్పుడు నీ జీవితం అసంపూర్ణమా?” కూతురి ప్రశ్న.

“వినడానికి నిష్ఠూరంగా వున్నా అదే నిజం! నేను ఆనాడు జీవించింది నాకోసం కాదు, మీ అందరికోసం. అనుక్షణం మీకూ, మీ నాన్నకు అనుగుణంగా నన్ను నేను మలుచుకోవడంతోనే ఆ జీవితం గడిచిపోయింది. మీకు సేవలు చేయడంలోనే కాలమంతా కరిగిపోయింది. మీ నాన్న ఉద్రేకాలు, మీ ఉద్వేగాలు తీర్చుకునేందుకు నేను వారధి. మీలోని అలజడులు గమనిస్తూ అనుకూలంగా నడుచుకోవడమే నా పరమావధి. మీ పనులకు ఆటంకాలు వాటిల్లకుండా చూసుకోవడం నా విధి. నాపై ఇంతగా ఆధారపడ్డ మీరెవ్వరూ నాదో పెద్ద బాధ్యతగానే గుర్తించరు. ఆడదాని మనసు, అది మోసే బరువు తెలుసుకునే ప్రయత్నం చేయరు. దీనికెవరూ విలువకట్టరు. అసలు విలువే ఇవ్వరు. నాలో చెలరేగే భావాలన్నీ నాలోనే... లోలోనే అణచుకోవాలి” కావేరి గొంతు పూడుకుపోయింది. కొంచెం మంచినీళ్లు తాగి మళ్లీ గొంతు సవరించుకుంది కావేరి.

“ఏ చీర కట్టాలో మీ నాన్నే చెప్పాలి. కనీసం ఎంచుకునే అవకాశం కూడా నాకుండేది కాదు. నచ్చలేదని పొరపాటున అన్నానో నాలుగైదు రోజులు మాటామంతీ వుండదు. మళ్లీ నేనే బతిమలాడాలి. పుట్టింటికి పోయి నాలుగురోజులు సరదాగా గడిపింది లేదు. వెళ్లిన ఒక్కరోజూ కలిసే వెళ్లాలి. కలిసే రావాలి. ఇంట్లో ఏం కొనాలన్నా ఆయనే తీసుకురావాలి. ఏమంటే నీకు తెలీదులే అనేవాళ్లు. కనీసం ఊళ్లోనే వున్న మా పిన్నమ్మ దగ్గరికి పోవడానికి లేదు. నువ్వు ఒక్కర్దానివే వెళ్లలేవులే అనేసేవారు. ఆయనేంటి మీరూ అలా అన్నవాళ్లే” అంటున్న తల్లివంక చూస్తూ తలొంచుకున్నారంతా. “ఉద్యోగం చేసుకుంటున్నాను. ఊళ్లో ఉన్న పిన్నమ్మ దగ్గరికి పోలేనూ?! నాకు అంత లోకజ్ఞానం లేదంటారా? ఇల్లు, ఆఫీసు అంతే! అలాగే వుండాలి. ఉన్నాను కూడా!”

“ఓ యేడు వచ్చిన ఎరియర్స్‌తో పోగులు చేయించుకోవాలని ఎంతో ఆశపడ్డాను. ‘ఓహో! సంపాదనను ఏం చేసుకోవాలో నువ్వే నిర్ణయాలు తీసుకునేదాకా వచ్చిందన్నమాట!” అంటున్న మీ నాన్నకు సపోర్టుగా, ‘నీకేంటమ్మా లోటు. కావాలంటే నాన్న చేయించడూ” అంటూ మీరిద్దరూ పకపకా నవ్వారు. తప్ప నా మనసుకు నచ్చిన చిన్న కోర్కె తీర్చుకోలేకపోతున్నానని ఎవరికైనా తోచిందా?

“అసలు నాకేం కూరలు నచ్చుతాయో మీకు తెలుసా? మీరేంటి, నేనే మర్చిపోయాను. ఎందుకంటే ఆయన ఇష్టాలే ఇంట్లో వంటలు. ఆయనకు నచ్చిన కూరలే వండాలి. ఆయన తెచ్చిన కూరగాయలే వండాలి”

“ఇవేమీ మాకెన్నడూ చెప్పలేదేమమ్మా?” అడుగుతున్న పిల్లలతో, “చెప్పినా మీకివో పెద్ద కారణాలుగా అనిపించవమ్మా. నావి చెప్పుకోదగ్గ కష్టాలు కావు. కానీ మనసును మెలిపెట్టే విషయాలు. ఆ బాధ నాకే తెలుసు” అంది కావేరి మార్దవంగా.

“ఇపుడు నేను పెయింటింగ్ నేర్చుకుంటున్నా తెల్సా?” కావేరి అనగానే, “ఎందుకమ్మా?” ఇపుడు వారి గొంతులో అమ్మను విమర్శించాలన్న ఆలోచన లేదు. అమ్మ ఆవేదనను అర్థంచేసుకోవాలన్న తాపత్రయం తప్ప.

“నాకు చిన్ననాటి నుండీ బొమ్మలు వేయడమంటే ప్రాణం. స్కూల్లో, కాలేజీలో ప్రైజులు కూడా వచ్చాయి. ఖాళీ సమయం దొరికిందంటే చాలు బొమ్మలు వేసేదాన్ని. పుస్తకాలూ అలాగే చదివేదాన్ని. కానీ మీ నాన్న నావి పిచ్చిగీతలంటూ తీసిపారేశారు. పనులు పక్కనపెట్టి మహారాణిలా ఎందుకా పుస్తకాలు... అన్న మాటలు మళ్లీ నాచేత పుస్తకం ముట్టనివ్వలేదు. మరిప్పుడో, నన్ను తిట్టేవారు లేరు. ఎగతాళి చేసేవారు లేరు. ఇది నాదైన ప్రత్యేక లోకం. ఇందులో నాకు నచ్చింది తింటాను. నచ్చిన చీర కట్టుకుంటాను. తోచిన పుస్తకం చదువుకుంటాను. ఏ బొమ్మలైనా గీసుకుంటాను. నాకు తోచింది చేస్తాను. నాకు నచ్చింది చేస్తాను. ఇన్నేళ్ల తరువాత దొరికిన ఈ స్వేచ్ఛను పూర్తిగా సద్వినియోగం చేసుకుంటాను. దయచేసి నామానాన నన్ను ఉండనివ్వండి. నా ఓపిక అయిపోతే, అప్పుడు సంగతి తర్వాత చూద్దాం” అంది ఉద్వేగంగా.

“నాన్న అంత చెడ్డవాడామ్మా?” సాలోచనగా అంటున్న కూతురి వీపు నిమురుతూ, “కాదమ్మా! మిగిలిన విషయాల్లో ఆయన ఏ లోటూ చేయలేదు. ఇంటి బాధ్యతలు, మీ పెంపకాన్ని ఆయన ఏనాడూ విస్మరించలేదు. కుటుంబం కోసమే చివరిదాకా ఆరాటపడ్డారు. తన బాధ్యతలన్నీ సక్రమంగా నెరవేర్చారు. కానీ నేనూ ఓ మనిషినేనని... నాకూ వ్యక్తిత్వం ఉంటుందనీ... నాకూ ఓ మనసుంటుందనీ... దానికీ ఆలోచనలు, అభిప్రాయాలు, ఇష్టాయిష్టాలు ఉంటాయని మర్చిపోయారు. ఆయన చెడ్డవారు కాదమ్మా. మగాడు అంతే!” అంది కావేరి.

- కె.అరుణ

నింగి నేల నాదే

అప్పడే పుట్టిన పసికందు... బొద్దుగా ముద్దుగా వుంది. వెంట్రుకలు ఒత్తుగా నల్లగా నిగనిగలాడుతున్నాయి. నిద్రలో నాలుక చప్పరించినప్పుడు బుగ్గ మీద పడే చొట్ట అందంగా వుంది. ఆ పాపను చూచిన ఎవ్వరికైనా చేతుల్లోకి తీసుకొని ముద్దాడాలనిపించేలా వుంది. కానీ... ముద్దులు మూటకట్టే ఆ చిన్నారికి ఒకటే లోపం. చేతులు లేవు. అవి లేకుండా క్షణం గడవదే. మరి తను బతికేదెలా! పాప కన్నవారితో సహా బంధువులు, స్నేహితులు, ఇరుగుపొరుగు అందరిలోనూ అదే సందేహం. కానీ అదే చేతుల్లేని పాప నింగి నేల నాదే అంటుందని... నేల మీద కారు, నింగిలోన విమానం నడిపేస్తుందని ఆ క్షణాన ఎవ్వరూ ఊహించలా!

దాదాపు పాతికేళ్ల తర్వాత ఇంటికొచ్చిన బాల్య స్నేహితురాలు జూలీని ఆత్మీయంగా ఆహ్వానించారు. బిల్, ఇనెజ్ దంపతులు. తన చిననాటి స్నేహితురాలు రాకరాక వచ్చిన సందర్భంగా ఇనెజ్ ఆఫీసుకు సెలవు పెట్టేసింది. బిల్ మాత్రం వారిద్దరినీ ఏకాంతంగా వదిలేసి ఆఫీసుకెళ్లిపోయాడు.

ఇనెజ్, జూలీ సంభాషణలు నిరంతర స్రవంతిలా సాగిపోతూనే వున్నాయి. భర్త, పిల్లలు, ఉద్యోగాలు, చదువులు అన్నీ... అన్నీ వచ్చాయి. అయితే మొదటి నుంచీ జూలీ కళ్లు మాత్రం దేనికోసమో వెతుకుతున్నట్లనిపించింది ఇనెజ్‌కు. అది దేనికోసమో కూడా తను ఊహించగలదు. తన నోటితో అడిగినప్పుడే చెప్పాలన్న పట్టుదలతో తెలియనట్టే ప్రవర్తించసాగింది ఇనెజ్. చివరకు జూలీనే వుండబట్టలేక అడిగేసింది.

"ఏది! నీ కూతురు? ఎలా వుంది? ఇప్పుడు దానికి పాతికేళ్లు నిండాయా! అసలు ఫిలిప్పైన్స్ నుంచి అమెరికాకు పనిగట్టుకొని వచ్చిందే దాన్ని చూడ్డానికి. ఏది చూపించు...అవునూ...దానికి కృత్రిమ చేతులు ఏవైనా పెట్టించారా? చెప్పు చెప్పు...." అంటూ ప్రశ్నల మీద ప్రశ్నలు కురిపించేసింది.

ఇనెజ్ సన్నగా నవ్వుతూ జూలీ చేతులు పట్టుకొని ఒక గదిలోకి తీసుకెళ్లింది. అది తన ముద్దుల కూతురు జెస్సికా గది. నాలుగు వైపులా గోడలమీద ఆర్టిస్టిక్‌గా వేళ్లాడదీసిన ఫొటోలు చూసిన జూలీకి నోట మాట రాలేదు.

"ఏంటి.. ఆ రోజు నీ పొత్తిళ్లలో చూచిన పాపేనా ఇది. నీ తొలి సంతానం ఇదేనా! ఆ చేతులు లేని పాప ఇదేనా! అచ్చు అన్ని అవయవాలు వున్న వారిలాగే పనులు చేసేస్తోందే! కారు నడుపుతోంది. విమానం నడుపుతోంది. ఈత కొడుతోంది. యువతను ఉత్తేజపరిచేలా ఉపన్యాసాలిస్తోంది. ... అన్నీ చేసేస్తోంది. ఇదెలా సాధ్యం?" మనసులో అనుకోబోయి పైకే అనేసింది జూలీ.

తన బలహీనతనే బలంగా చేసుకొని విజయాల మీద విజయాలు సాధిస్తున్న కూతురి గురించి చెప్పాల్సి వచ్చేసరికి ఇనెజ్‌కు నిజంగానే కళ్లెంట నీళ్లొచ్చాయి. అవి ఆనంద భాష్పాలు కావచ్చు! ఆ విజయాలు సాధించడానికి తాము, పాప పడిన కష్టం గుర్తొచ్చి పెల్లుబికిన కన్నీళ్లు కావొచ్చు.

వాటిని సంతోషంగా తుడుచుకని



చెప్పనారంభించింది ఇనెజ్. ఆమె నోటెంట వచ్చే ప్రతి ఒక్క మాటను విడిచిపెట్టకుండా జాగ్రత్తగా వినసాగింది జూలీ.

"మొదట చేతులు లేని నా బిడ్డ జెస్సికాను చూచి విపరీతంగా ఏడ్చాను...రోజుల తరబడి నా కళ్లు వర్షిస్తూనే వున్నాయి. ఈ సమాజంలో అన్ని అవయవాలు సక్రమంగా వున్న వారు బతకడమే కష్టంగా వుంది. అలాంటిది రెండు చేతులు లేకుండా బతకడమెలా! అనిపించింది. నేను నా చేతులు రెండూ కట్టేసుకొని కనీసం ఒక్క రోజు వుండగలనేమో ప్రయత్నించాను. రోజులు కాదు కదా. నిముషం కూడా గడవదని అనుభవ పూర్వకంగా తెలుసుకున్నాను. ఆ క్షణం ఆ విషయంలో పాప శాపగ్రస్తగానే కనిపించింది నాకళ్లకు.

కానీ నేను ఏమాత్రం దిగాలు పడినా, నిరాశ చెందినా పాప భవిష్యత్తు నాశనమౌతుందనుకున్నాను. నాకు నేనే ధైర్యం చెప్పుకొని ముందుకు నడవాలనుకున్నాను. అన్ని పనులు తనంతట తనే చేసుకొనేలా శిక్షణ ఇవ్వాలనుకున్నాను. అంతేకాదు. మామూలు మనుషులందరి వల్లా కాని పనులు కూడా చేయగలిగేలా నేర్పాలనుకున్నాను.

జెస్సికా ఎదిగే కొద్దీ తన లోపమేమిటో తనకు తెలియసాగింది. కానీ మా మాటలు, చేతలు, ఆప్యాయత, శిక్షణ ఆ లోపాన్ని మర్చిపోయేలా చేశాయి. కాళ్లతోనే అన్ని పనులు చేయడం నేర్పించాం.

బ్రష్ చేసుకోవడం, తల దువ్వుకోవడం, స్నానం చేయడం, తినడం, కాగితం మీద బొమ్మలు వేయడం, రాయడం... అన్నీ..!

కొంచెం ఎదిగే కొద్దీ స్నేహితులతో కలిసి మెలగడం నేర్పాం. తోటి పిల్లల ఎగతాళి, చిన్నచూపు, వేధింపులు అన్నిటినీ ధైర్యంగా, తెలివిగా ఎదుర్కొంది జెస్సికా. డాన్స్ చేయడం, ఈదడం కూడా నేర్పించాం. చేతులు లేకుండా తనను తను కాపాడుకోవడం ఎంతో ముఖ్యం. అందుకు ఈత ఒక్కటే సరిపోదు. మార్షల్ ఆర్ట్స్ క్లబ్‌లో చేర్చాం. తైక్వాండో నేర్చుకుంది. అందులో బ్లాక్‌బెల్ట్ 2 డిగ్రీ సంపాదించడానికి అది పడ్డ కృషి, కష్టం, పెట్టిన శ్రద్ధ ఇప్పటికీ మర్చిపోలేను. ఇంక అదేముంది! కారు కూడా కాళ్లతోనే నడిపేస్తుంది. ఒక కాలు స్టీరింగ్ మీద, మరో కాలు బ్రేక్ మీద పెట్టి సునాయాసంగా కారు నడిపేస్తుంది.

జూలీ! ఒక రోజు అకస్మాత్తుగా నా దగ్గరకొచ్చి జెస్సికా ఏమడిగిందో తెల్సా! పైలెట్ అవ్వాలనుందమ్మా...అంది. అంతే! నాకు మతిపోయింది. ఎవ్వరు ఎన్ని మాటలు చెప్పినా వినలా! కారులో వెళ్లి శిక్షణ పొందడానికి అనుమతి సంపాదించి ఇంటికి చేరింది. గంటకు వంద డాలర్ల ఫీజు. ఎలా ఒప్పుకున్నారంటే... అది చెప్పిన మాటలకు నాకు నోట మాట రాలా! తను కారు నడపడం చూసి పైలెట్ శిక్షణకు అనుమతించారట. శిక్షణ పూర్తి చేసుకోవడం, లైసెన్స్ పొందడం అన్నీ అయిపోయాయి.

జూలీ! నా జెస్సికా తన మేకప్ తనే వేసుకొంటుంది. కాలితో కాంటాక్టు లెన్సులు పెట్టుకుంటుంది. టిఫిన్ తయారుచేసుకుంటుంది. బబుల్‌గమ్‌కి చుట్టిన కాగితం తనే తీసుకుంటుంది. ..." చెప్తూనే వుంది ఇనెజ్. వింటూనే వుంది జూలీ. కానీ వెంటనే జెస్సికాను చూడాలన్న కోరిక మాత్రం అణచుకోలేకపోయింది. అడిగేసింది కూడా.



◆◆◆

ఆ సాయంత్రం తండ్రితో కలిసి వచ్చిన జెస్సికాను చూచి జూలీ ఆనందంతో ఏడ్చేసింది. తల్లి వెంట బిడ్డలా జెస్సికా వెంటే వుంది ఆ రోజంతా. అంతే... జూలీకి ఈ మధ్య చూసిన సినిమాలో పాట గుర్తొచ్చింది.

ఆరాటం ముందు ఆటంకం ఎంత?
సంకల్పం ముందు వైకల్యం ఎంత?
దృఢచిత్తం ముందు దురదృష్టం ఎంత?
ఎదురీత ముందు విధి రాత ఎంత?
నమ్మకము... పట్టుదల నా రెండు రెక్కలుగా
ఎగిరేస్తా ఆశల ఆకాశాన...
పాదాలను పిడికిలిగా...నా గుండెను
గుప్పిటగా
గెలిచేస్తా....సంతోషపు సామ్రాజ్యాన్నంతా...

- చరిత



పరామర్శించే పాదాలు



బడుగు జీవుల
బతుకు కోసం
బయలుదేరిన పాదాలు
పల్లె పల్లెను
పరామర్శిస్తూ వెళ్తుంటే
ఆత్మహత్యల నివేదనలు
నిప్పుకణికల నిరసనలు!

పర్యావరణ పరిరక్షణ కోసం
పరితపించే పాదాలు
బాట మీద వెళ్తూ వుంటే
వట్టిపోయిన పాలపొదుగుల్లా
ఎండిపోయిన ఊరిచెరువులు
భూమి సికం కబ్జా అయి కూర్చుంటే

పల్లెతల్లి గుండె మీద
కరువు పాదాల గాయాలు!

మసకబారి
ఉరిబారిన పడుతున్న
బలహీన క్షణాలకు
అభయమిస్తూ
వెళుతున్న పాదాలు
స్వప్రయోజనాలకే పునాదులు!

ఉపాధి కల్పించని
ఉత్తుత్తి ఓదార్పులు
ఒడి నిండని ధాన్యాలని
ఏనాడో తెలుసుకునేది జనాలు!!

- రావుల పుల్లాచారి

సగటు మనస్తత్వం

జీవితం క్షణికం... సత్యం సుదీర్ఘం
ఇదే మహాత్ముడు జాతికిచ్చిన సందేశం
సందేహం లేకుండా ఎప్పుడో దాన్ని మరిచాం
నేను సంతోషంగా ఉంటే చాలనుకుంటున్నాం
ఎవరెలా ఉన్నా మనకు అనవసరం
ఇదే నేడు మనం నమ్ముకున్న విధానం
విలువలకెప్పుడో తిలోదకాలిచ్చేశాం
శీల నిర్మాణానికి ఫుల్‌స్టాప్ పెట్టేశాం
నాగరికత పేరుతో అనాగరికత మనస్తత్వం పెంచుకున్నాం
బతుకుబండి సాఫీగా సాగేందుకే పెద్దపీట వేశాం
అనుక్షణం అబద్ధాలతో జీవితం గడిపేస్తున్నాం
శ్రీరంగనీతులు ఎన్నైనా చెబుతాం
ఆచరణలో మాత్రం ఆమడదూరంలో ఉంటాం.
ఇదే... ఇదే... నేటి మన సగటు మనస్తత్వం
ఎవరు కాదన్నా... ఇది మాత్రం నిజం... నిజం

- మొర్రి గోపి

ఇంటిదొంగ

నిజమే
మన మూలాల్ని
మనం వెతుక్కోవలసిన
పరిస్థితే!
అసలు ఇంతవరకూ
వెతుక్కోక పోవడమేమిటి?
అసమర్థతా? అలక్ష్యమా?
అతి విశ్వాసమా? అప్రధానమా?
నేడు వాడెవడో
మన కాళ్ల కింద భూమిని
వృత్తాలు గీసి
రావణాసురుడై
ఎత్తుకు పోతుంటే
రెక్కలు తెగిన పక్షి పోరాటం ఎన్నాళ్లు?
అసలు మన మూలాలను
వాడికి చెప్పిందెవరు?
మనవాడేనా... ద్రోహి...?
వాణ్ణి ఆహ్వానించిందెవరు?
మనవాడేనా... విద్రోహి...?
అందుకే
పోరాటం వాడెవడి మీదో కాదు
మన మూలాల్ని వాడికి చెప్పిన
మనవాణ్నే వెతికి పట్టుకుని
దేహశుద్ధి చేస్తేగాని
దేశం శుద్ధి అవదు!

- పి. లక్ష్మణ్‌రావు

యాపిల్ రసగుల్లా

కావలసిన పదార్థాలు

యాపిల్ పేస్ట్ - 2 కప్పులు
బ్రెడ్ ముక్కలు - 8
పంచదార - 2 కప్పులు
నీళ్లు - 1 కప్పు
బాదం పప్పు తరుగు - 2 టీ స్పూన్లు
ఇలాచి పొడి - కొంచెం
నూనె - వేయించడానికి సరిపడా

తయారు చేసే విధానం

బ్రెడ్ ముక్కలు చివరలు కత్తిరించుకోవాలి. పంచదార, నీళ్ల కలిపి లేత పాకం పట్టి గోరువెచ్చగా ఉంచాలి. బ్రెడ్ ముక్కలను కొంచెం తడిపి వాటి మధ్యలో యాపిల్ పేస్ట్‌ను పెట్టి ముద్దగా చెయ్యాలి. వేడి నూనెలో బంగారు రంగు వచ్చేవరకు వేయించాలి. వీటిని పంచదార పాకంలో వేయాలి. పాకం బాగా పీల్చిన తర్వాత వీటిని తీసి ఓ గిన్నెలో పెట్టాలి. చివరిగా వాటిపై బాదం తరుగు, ఇలాచీ పొడి చల్లాలి. అంతే నోరూరించే యాపిల్ రసగుల్లాలు రెడీ.

ఎన్. జోత్స్న,
శ్రీకాకుళం.

పాలక్ పట్టీలు

కావలసిన పదార్థాలు

మైదా - 2 1/2 కప్పులు
ఉడకబెట్టిన పాలకూర గుజ్జు - 1/2 కప్పు
వాము - 1 స్పూను
ఉప్పు - తగినంత
కారం - రుచికి సరిపడా
నూనె - వేయించడానికి తగినంత

తయారు చేసే విధానం

మైదాలో అరకప్పు వేడినూనె పోసి బాగా కలపాలి. ఇందులో ఉప్పు, కారం, వాము, పాలకూర గుజ్జు వేసి పిండిని ముద్దగా కలుపుకోవాలి. అవసరమైతే కొద్దిగా నీళ్లు పోసి కలపాలి. దీన్ని పావుగంట నాననివ్వాలి. తర్వాత ఈ ముద్దని చిన్న వుండలుగా చెయ్యాలి. వీటిని చపాతీల్లా రుద్ది అరంగుళం ముక్కలుగా చాకుతో కొయ్యాలి. ఈ ముక్కలని కాగిన నూనెలో వేయించితే పాలక్ పట్టీలు రెడీ అయినట్లే.



యాపిల్ బర్ఫీ

కావలసిన పదార్థాలు

సన్నగా తరిగిన యాపిల్ - 100 గ్రా
కోవా - 100 గ్రా
పంచదార - 100 గ్రా
నీళ్లు - 100 గ్రా
బాదం పప్పు ముక్కలు - 1 స్పూను
పసుపు రంగు - చిటికెడు

తయారు చేసే విధానం

నాన్‌స్టిక్ కడాయిలో నీళ్లు , పంచదార వేసి సన్నని సెగమీద వేడిచెయ్యాలి. చక్కెర కరిగిన తర్వాత యాపిల్ తరుగు, పసుపు రంగు వేసి కలపాలి. రెండు నిమిషాల తర్వాత యాపిల్ తురుము పాకంలో కలిసిపోతుంది. అందులో కోవా కలిపితే మిశ్రమం చిక్కబడుతుంది. దీన్ని ఒక ప్లేట్‌లోకి వంపి సమానంగా సర్దాలి. ఆరిన తర్వాత ఇష్టం వచ్చిన ఆకారంలో ముక్కలు కోసుకోవాలి. వాటిపై బాదం ముక్కలు అలంకరించి సర్వ్ చెయ్యాలి.

బంగాళదుంప కారప్పూస

కావలసిన పదార్థాలు

ఉడకబెట్టిన బంగాళదుంప ముద్ద - 1/2 కప్పు
శనగపిండి - 1 కప్పు
ఉప్పు - తగినంత
కారం - రుచికి సరిపడా
నూనె - వేయించడానికి తగినంత

తయారు చేసే విధానం

శనగపిండిలో ఉప్పు, కారం వేసి జల్లించుకోవాలి. బంగాళదుంప ముద్దని కూడా జల్లెడలో వేసి రుద్దితే గడ్డలు లేకుండా మెత్తని గుజ్జు వస్తుంది. ఇందులో వేడినూనె వేసి బాగా కలపాలి. అసరమైనన్ని నీళ్లుపోసి ముద్దగా కలపాలి. దీన్ని జంతికల గిద్దెల్లో పెట్టి కాగిన నూనెలో వత్తి వేయించాలి. అంతే కరకరలాడే బంగాళదుంప కారప్పూస రెడీ. ఇవి అచ్చంగా చిప్స్‌లా ఉంటాయి. పిల్లలు భలే ఇష్టంగా తింటారు.

ఆహ్వానం

ఘుమఘుమలాడే వంటకాలు చేయడంలో మీకు ఎనలేని ఆసక్తి వుందా! ప్రయోగాత్మక వంటకాలు చేసి అతిథులకు వడ్డించి మెప్పించగలరా! చవులూరింపచేసే సంప్రదాయ శాకాలు చేయడంలో దిట్టా! ఎండన పడి వచ్చిన వారికి చిటికెలో చల్లని పానీయాలు అందించేస్తారా? మరెందుకండీ ఆలస్యం? ఎంచక్కా వాటిని ఓ కాగితం మీద రాసి పంపండి. తగిన పారితోషికం అందుకోండి. ముఖ్యమైన విషయం! మీ చిరునామా పూర్తిగా రాయడం మరువకండి.

మీ రుచులు పంపాల్సిన మా అడ్రస్:
రుచి, ఆదివారం అనుబంధం, ప్రజాశక్తి,
మోటూరు హనుమంతరావు భవన్, 21/1,
ఆజామాబాద్ ఇండస్ట్రియల్ ఏరియా,
హైదరాబాదు.

సినిమా కబుర్లు

ఎనిమిది పదుల ఎనలేని వింత

మన దేశంలో వెండితెర మీద బొమ్మ మాట్లాడడం మొదలై ఇప్పుడు సరిగ్గా 80 ఏళ్ళు కావస్తోంది. మాటలు లేని మూగ సినిమాల (మూకీల) యుగం నుంచి భారతీయ సినిమా మాట, పాట నేర్చిన (టాకీల) స్థాయికి ఎదిగిన కథ ఎన్నో గమ్మత్తయిన అనుభవాల సమాహారం. తొట్టతొలి భారతీయ టాకీ 'ఆలం ఆరా' ఇప్పటికి సరిగ్గా ఎనిమిది దశాబ్దాల క్రితం 1931 మార్చి 14న విడుదలైంది. మూకీ చిత్రాల నుంచి మాట్లాడే సినిమాల వైపు జనం ఎలా విపరీతంగా ఆకర్షితులయ్యారనే సంగతులు ఇవాళ్టికీ మనకు ఆసక్తి కలిగిస్తాయి, అబ్బురపరుస్తాయి. ఆ విశేషాల ఫ్లాష్‌బ్యాక్‌లోకి వెళదాం. రండి!

మన దేశంలో మూగ సినిమాల చలనచిత్ర ప్రదర్శన తొలిసారిగా 1896 జూలై 7న, బొంబాయిలో జరిగినట్లు సినిమా చరిత్ర చెబుతోంది. మొదట్లో విదేశాల నుంచి ఈ మూకీ చిత్రాలను తెచ్చి, ఇక్కడ ప్రదర్శించేవారు. 1910వ దశకంలో భారతదేశంలో మన దేశీయులే పూర్తిస్థాయి మూకీ కథా చిత్రాల నిర్మాణం ప్రారంభించారు. ఆర్.జి. టోర్నీ, దాదాసాహెబ్ ఫాల్కే లాంటి తొలితరం సినీ రూపకర్తలతో భారతదేశంలో సినిమా పరిశ్రమకు బీజం పడింది. మరి, ఆ తరువాత మూకీల నుంచి టాకీలకు ఎదగడం వెనుక పెద్ద కథే జరిగింది.

ఆర్థిక మాంద్యం తెచ్చిన అనూహ్యమైన మార్పు

తెరపై కదిలే బొమ్మల ప్రదర్శనగా మొదట్లో మూకీలు ప్రపంచమంతటినీ అమితంగా ఆకర్షించాయి. భారతదేశంలోనూ అదే పరిస్థితి. అంతా బాగా జరుగుతోందని అనుకుంటున్న సమయంలో 1920ల చివరలో తలెత్తిన ఆర్థిక సంక్షోభం పాశ్చాత్య దేశాల లాగానే భారతదేశం మీద కూడా తీవ్రమైన ప్రభావం చూపింది. చలనచిత్ర పరిశ్రమ మీద ఆ దెబ్బ గట్టిగా పడింది. ప్రజలకు కదిలే చిత్రాల మీద ఆసక్తి క్రమంగా క్షీణించింది. ప్రజల్లో మారుతున్న వైఖరిని గమనించకుండా గబగబా సొమ్ములు చేసుకోవాలన్న నిర్మాతల వైఖరి, చలనచిత్ర కళలో శరవేగంగా వస్తున్న మార్పులకు అనుగుణంగా దర్శక - నిర్మాతలు మారకపోవడం వల్ల బాక్సాఫీస్ వసూళ్ళు క్రమంగా క్షీణించాయి. దాంతో, మనదేశంలో చాలా భాగం సినిమాహాళ్ళు మూతపడ్డాయి. అనేక చలనచిత్ర నిర్మాణ సంస్థలు బిచాణా ఎత్తేశాయి.

శబ్ద శకానికి శ్రీకారం

అయితే, 1930ల నాటి ప్రపంచ ఆర్థిక మాంద్యం వల్లే 'శబ్ద సహిత చిత్రాలు' (సౌండ్ ఫిల్మ్) ఆవిర్భవించాయని చెప్పుకోవచ్చు. అప్పటి దాకా శబ్దం లేని మూగ చిత్రా (సైలెంట్ ఫిల్మ్)లే చూస్తూ వచ్చిన ప్రేక్షకులకు ఈ 'సౌండ్ ఫిల్మ్'లు ఒక కొత్త వింతగా మారాయి. అలా 'సౌండ్ ఫిల్మ్'ల ఆవిర్భావంతో అమెరికాలోనూ, ఇతర ప్రాంతాల్లోనూ బాక్సాఫీస్ వసూళ్ళకు మళ్ళీ కొత్త ఊపు వచ్చింది. 'డాన్ జువాన్' అనే సైలెంట్ ఫిల్మ్‌లోని దృశ్యాలకు తగ్గట్లుగా సంగీతాన్నీ, సౌండ్ ఎఫెక్ట్‌లనూ జత చేసి, వార్నర్ బ్రదర్స్ వాణిజ్యపరంగా సినిమాల్లో శబ్ద శకానికి శ్రీకారం చుట్టారు. 1926 ఆగస్టు 6న ఇది జరిగింది.

ఆ తరువాత ఓ సంవత్సరానికి 'ది జాజ్ సింగర్' చిత్రంలో తెర మీద బొమ్మకు తగ్గట్లుగా మాట, సంగీతం కూడా జత చేసి, వార్నర్ బ్రదర్సే ఓ సంచలనాత్మక విజయం సాధించారు. ఆ చిత్రంలో "ఒక్క క్షణం ఆగండి, ఒక్క క్షణం ఆగండి! ఇప్పటి వరకు మీరింకా ఏమీ వినలేదు..." అంటూ ఓ సహజమైన స్వరం వినిపించినప్పుడు జనం ముగ్ధులైపోయారు. 'ది జాజ్ సింగర్' విజయం తరువాత 1928లో వార్నర్ బ్రదర్స్ తొలిసారిగా 'అన్ని పాత్రలూ మాట్లాడే' చలనచిత్రం 'ది లైట్స్ ఆఫ్ న్యూయార్క్'ను విడుదల చేశారు. నిజానికి, తెర మీద కదిలే బొమ్మలకూ, రికార్డు చేసిన శబ్దానికీ జత కట్టాలన్న ఆలోచన చాలా పాత కాలం నుంచీ ఉన్నదే! అయితే, అవి చాలాకాలం ప్రయోగదశలోనే మిగిలాయి. తెర మీది బొమ్మకు తగ్గట్లుగా శబ్దాన్ని జత చేసే 'ఫోనో ఫిల్మ్' ప్రక్రియను డాక్టర్ లీ డి ఫారెస్ట్ కనిపెట్టారు. ఆ ప్రక్రియను తొలిసారిగా భారతదేశంలో 1927 మే నెలలో బొంబాయిలోని రాయల్ ఒపేరా హౌస్‌లో ప్రదర్శించారు.

భారతదేశంలో తొలి శబ్దచిత్ర ప్రయత్నాలు

వీటన్నిటి తరువాత భారతదేశంలో సైతం బొమ్మలకు తగ్గట్లు శబ్దాన్ని జోడించి, చలనచిత్రాన్ని రూపొందించేందుకు మదన్ థియేటర్స్ సంస్థ అందరి కన్నా ముందుగా ప్రయత్నాలు చేసింది. 1929లో మదన్ థియేటర్స్ సంస్థ భారతదేశంలోనే తొలిసారిగా కలకత్తాలోని ఎల్ఫిన్‌స్టన్ పిక్చర్ ప్యాలెస్‌లో యూనివర్సల్ వారి 'మెలోడీ ఆఫ్ లవ్' అనే టాకీ చిత్రాన్ని ప్రదర్శించింది. నిజానికి, భారతదేశ తూర్పు ప్రాంతంలో అలా శాశ్వత ప్రాతిపదికన శబ్ద యంత్రాలను సమకూర్చుకున్న మొట్టమొదటి హాలు కలకత్తాలోని ఆ ఎల్ఫిన్‌స్టనే! విదేశాల నుంచి టాకీ చిత్రాలు వస్తుండే సరికి 1930 చివరి నాటికల్లా భారతదేశంలోని మొత్తం 370 థియేటర్లలో 30కి పైగా థియేటర్లు (అంటే దాదాపు 10 శాతం హాళ్ళన్న మాట!) శబ్ద సహిత చిత్రాలను ప్రదర్శించేందుకు వీలుగా తగిన సామగ్రిని సమకూర్చుకున్నాయి.

తరచూ విదేశాల్లో పర్యటించే మదన్ థియేటర్స్ సంస్థ యజమాని జె.జె. మదన్ న్యూయార్క్‌లో 'ది జాజ్ సింగర్'ను చూశారు. దానికి ప్రజల నుంచి వస్తున్న అనూహ్యమైన స్పందనను గమనించారు. ఇక, సినిమా భవిష్యత్తు అంతా శబ్దంతో కూడిన చిత్రాల్లోనే ఉందని గ్రహించారు. సరికొత్త పరిణామాలను లోతుగా పరిశీలించడం కోసం హాలీవుడ్‌ను సందర్శించి, భారత్‌లోని తన స్టూడియోకు శబ్ద సామగ్రి కొనుగోలు చేసేందుకు ఆర్డరు పెట్టారు. అదే సమయంలో కలకత్తా శివార్లలోని టాలీగంజ్ ప్రాంతంలో ఓ సౌండ్-ప్రూఫ్ స్టూడియో నిర్మాణం మొదలైంది. ఆ టాలీగంజ్ ప్రాంతం పేరిటే అక్కడి చిత్ర పరిశ్రమ ఆ తరువాత 'టాలీవుడ్'గా ప్రసిద్ధమైంది. (అలా బెంగాలీ పరిశ్రమకు ప్రసిద్ధమైన పేరును అజ్ఞానంతో అరువు తెచ్చుకొని, దానికి సంబంధమే లేని తెలుగు చిత్ర పరిశ్రమను 'టాలీవుడ్' అని తప్పుడు పేరుతో పిలవడం గడచిన పదేళ్ళ పైచిలుకుగా తప్పుగా ప్రచారంలోకి వచ్చింది!)



పోటాపోటీలో ముందు వచ్చిన 'ఆలమ్ ఆరా'

మరి, కలకత్తాకు చెందిన మదన్ థియేటర్స్ ఇంత కృషి చేస్తుంటే, బొంబాయికి చెందిన అర్దేషిర్ ఇరానీ నేతృత్వంలో ఇంపీరియల్ ఫిల్మ్ కంపెనీ వారి 'ఆలమ్ ఆరా' తొలి భారతీయ టాకీ ఎలా అయింది? దీని వెనుక కూడా ఓ చిన్న కథ ఉంది. నిజానికి, పూర్తిస్థాయి భారతీయ టాకీ చిత్రాల రూపకల్పన కోసం అప్పట్లో కనీసం మూడు సిండికేట్ సంస్థలు పోటాపోటీగా ప్రయత్నించాయి. పూర్తి స్థాయిలో

మాట్లాడే చలనచిత్రాన్ని రూపొందించాలన్న పోటాపోటీలో ఎట్టకేలకు అర్దేషిర్ ఇరానీ నేతృత్వంలోని 'ఇంపీరియల్ ఫిల్మ్ కంపెనీ'యే ప్రత్యర్థులపై పైచేయి సాధించింది. ఎనభై ఏళ్ళ క్రితం 1931 మార్చి 14న తొలి పూర్తి నిడివి భారతీయ టాకీ 'ఆలమ్ ఆరా'ను బొంబాయిలోని 'మెజెస్టిక్ సినిమా' హాలులో విడుదల చేసింది.

అర్దేషిర్ ఇరానీ

నాటకం నుంచి సినిమాగా 'ఆలమ్ ఆరా'

ఈ చిత్ర కథ కూడా రంగస్థలం మీద నుంచి వెండితెరకు నడిచి వచ్చినదే! పార్శీ ఇంపీరియల్ థియేటరికల్ కంపెనీకు చెందిన నాటక రచయిత జోసెఫ్ డేవిడ్ రాసిన 'ఆలమ్ ఆరా' నాటకం అప్పట్లో రంగస్థలంపై విజయవంతమైంది. అందులో కథ ఏమిటంటే – కుమార్‌పూర్ రాజు గారికి ఇద్దరు భార్యలు. ఆ రాణులిద్దరికీ పిల్లలు లేరు. ఓ ఫకీరు చెప్పిన జోస్యం ప్రకారం వారిద్దరిలో సుగుణశీలి అయిన రాణి నవ్‌బహార్‌కు ఓ కొడుకు పుడతాడు. దాంతో, దుష్ట రాణి దిల్‌బహార్‌కు విపరీతమైన అసూయ కలుగుతుంది. మరోపక్క, సైన్యాధ్యక్షుడైన అదిల్ మీద దిల్‌బహార్ మనసు పడుతుంది. కానీ, అతనేమో ఆమె కోరికను తోసిపుచ్చుతాడు. ప్రతీకారంతో ఆమె అతణ్ణి ఖైదు చేయిస్తుంది. అదిల్ భార్య ఓ ఆడపిల్లకు జన్మనిచ్చి చనిపోతుంది. ఆ ఆడపిల్లే – ఆలమ్ ఆరా (నటి జుబేదా). కోయగూడెంలో ఆ అమ్మాయి పెరుగుతుంది. ఖైదులో ఉన్న తండ్రిని చూడడం కోసం ఒకసారి ఆ అమ్మాయి రాజప్రాసాదానికి వస్తుంది. మెడలోని హారం వల్ల ఆమె ఎవరన్నదీ తెలుస్తుంది. అక్కడ ఆమె, యువరాజు (నటుడు మాస్టర్ విఠల్)ను కలుస్తుంది. వారిద్దరూ ప్రేమలో పడతారు. చివరకొచ్చేసరికి – అదిల్ ఖైదు నుంచి విడుదలవుతాడు. దుష్టరాణి దిల్‌బహార్‌కు శిక్ష పడుతుంది. యువరాజు, ఆలమ్ ఆరాల పెళ్ళితో కథ సుఖాంతమవుతుంది.

సంచలనాత్మక ఆదరణ

అనేకానేక పాటలు, నృత్యాలను గుదిగుచ్చి అందించడానికి ఈ సాదాసీదా ఇతివృత్తం తోడ్పడింది. అయితేనేం, కథ ఏమిటని కాక, తెర మీద కదిలే బొమ్మలను చూడడమే కాక మాటలూ వినవచ్చని జనం వేలంవెర్రిగా థియేటర్లకు తరలివచ్చారు. 'ఆలమ్ ఆరా' విడుదల రోజున తెల్లవారుజాము నుంచే జనం బొంబాయిలోని మెజెస్టిక్ సినిమా దగ్గరకు గుంపులు గుంపులుగా చేరడం మొదలైంది. "ఎంతో కష్టం మీద గానీ మేము కూడా థియేటర్‌లోకి ప్రవేశించలేకపోయాం" అని అర్దేషిర్ ఇరానీ భాగస్వామి అబ్దులాలీ యూసూఫాలీ తెలిపారు. "అప్పట్లో 'వరుస'లో నిల్చొని, టికెట్లు తీసుకొనే పద్ధతి కూడా ప్రేక్షకులకు తెలియదు. దాంతో, జనం టికెట్ బుకింగ్ ఆఫీసు మీదకు గుంపుగా వచ్చి పడ్డారు. తమకు అర్థమైన భాషలో మాట్లాడే సినిమాను చూడడానికి, ఎలాగోలా టికెట్ సంపాదించాలని తాపత్రయపడ్డారు. దాంతో ఆ ప్రాంతంలో ట్రాఫిక్ స్తంభించిపోయింది. చివరకు జనాన్ని అదుపు చేయడానికి పోలీసుల సాయం తీసుకోవాల్సి వచ్చింది... వారాల తరబడి టికెట్లు అమ్ముడైపోయాయి. ఎక్కువ రేటుకు బ్లాకులో టికెట్లు అమ్మేవాళ్ళు యధేచ్ఛగా సొమ్ము చేసుకున్నారు" అని ఆనాటి అనుభవాలను ఆయన గతంలో వెల్లడించారు.

సినిమా కష్టాలు

'ఆలమ్ ఆరా' తీయడానికి పడ్డ కష్టాలను ఆయన వివరిస్తూ, "అప్పట్లో సౌండ్-ప్రూఫ్ స్టేజీలు లేవు. దాంతో మేము స్టూడియో లోపల, అదీ రాత్రి వేళ చిత్రీకరణ జరపడానికి మొగ్గు చూపేవాళ్ళం. మా స్టూడియో పక్కనే రైలు మార్గం ఉండేది. ఫలితంగా, ఆ శబ్దం రికార్డు కాకుండా ఉండడం కోసం, రైళ్ళు రాకపోకలు లేని సమయంలోనే షూటింగ్ జరపాల్సి వచ్చేది. పైగా, ఒకే సిస్టమ్‌తో కూడిన టానర్ రికార్డింగ్ సామగ్రితోనే శబ్దగ్రహణం చేయాల్సి వచ్చింది...



భక్త ప్రహ్లాద (తొలి తెలుగు టాకీ)

అలాగే, నటీనటులు నటిస్తూ పలికే మాటలు, పాటలు రికార్డింగ్ చేయడానికి బూమ్‌లు (దూరంగా ఉంచి రికార్డు చేసే మైకులు) కూడా లేవు. కెమెరా కన్నులో పడకుండా మైక్రోఫోన్లను ఎక్కడెక్కడో రహస్యంగా ఉంచి, మాట, పాట రికార్డు చేయాల్సి వచ్చింది" అని ఇరానీ చెప్పారు. కఠినమైన రికార్డింగ్ పరిస్థితుల కారణంగా 'ఆలమ్ ఆరా' రూపకల్పనకు నెలలకొద్దీ సమయం పట్టింది. పైగా, ప్రత్యర్థి సినిమా సంస్థల నుంచి పోటీని నివారించడం కోసం అంతా గుట్టుచప్పుడు కాకుండా చేయాల్సి వచ్చింది.

భారతీయ తొలి టాకీ 'ఆలమ్ ఆరా'లో సాంకేతిక, కళాత్మక విలువలు స్వల్పమే! అయినప్పటికీ, తొలి ప్రయత్నంగా అందరూ దాన్ని ఆదరించారు. 'ఆలమ్ ఆరా' అఖండ విజయంతో 'పాత్రలన్నీ మాట్లాడుతూ, పాటలు పాడుతూ, నృత్యం చేసే' చిత్రాలు చకచకా తయారయ్యాయి. గళం ప్రధానం కావడంతో రంగస్థల నటీనటుల్ని దర్శక – నిర్మాతలు తీసుకోసాగారు. 'ఆలమ్ ఆరా' విడుదలైన సరిగ్గా మూడు వారాల కల్లా తొలి బెంగాలీ టాకీ 'జమాయ్ షష్ఠి'ని మదన్ థియేటర్స్ విడుదల చేసింది. ఆ వెంటనే 'షిరీన్ ఫర్హాద్' అనే మరో భారతీయ టాకీని రూపొందించింది. 'షిరీన్ ఫర్హాద్' చిత్రాన్ని 22 సార్లు చూడడం కోసం లాహోర్‌లో టాంగా తోలే ఓ పంజాబీ ఏకంగా తన గుర్రాన్నే కుదవపెట్టాడట! ఆ ఊపులో ఒక్క 1931లోనే 8 టాకీ చిత్రాలనూ, 1932లో 16 టాకీలనూ మదన్ థియేటర్స్ రూపొందించింది.

భారతీయ టాకీలు తెచ్చిన మార్పులు

టాకీల ప్రవేశంతో సౌండ్ ప్రక్రియకు మారే స్థోమత లేక చాలా స్టూడియోలు మూతపడ్డాయి. అలాగే, అప్పటి దాకా మూకీల్లో ప్రసిద్ధ తారలుగా వెలిగిన ఆంగ్లో – ఇండియన్ నటీమణులు సైతం ధారాళంగా హిందీ, ఉర్దూ మాట్లాడలేక, తెర మరుగయ్యారు. పాటలు పాడుకోవడం రాని వారు కూడా నటనకు దూరం కావాల్సి వచ్చింది. శబ్దగ్రహణంలోని ఇబ్బందుల రీత్యా నటీనటులంతా మైకును దృష్టిలో పెట్టుకొని, దాని మీద ధ్యాసతో నటించాల్సి వచ్చేది. పాటలన్నీ ఒకే షాట్‌లో చిత్రీకరించేవారు. ఎవరికీ నైపుణ్యం లేదు గనక, ప్రయోగాలు చేస్తూ చిత్రీకరణ జరపడంతో బోలెడంత ముడి ఫిల్ము వృథా అయ్యేది. అయితేనేం, కొత్త ఒక వింతగా జనం విపరీతంగా వచ్చి, ఈ చిత్రాలు చూసేవారు. ఈ బాక్సాఫీస్ వసూళ్ళతో చాలా సినిమా హాళ్ళు, సంస్థలు అప్పుల ఊబి నుంచి బయటపడ్డాయి. ఆర్థిక మాంద్యం కారణంగా మూతబడ్డ హాళ్ళు మళ్ళీ తెరుచుకున్నాయి.

దాదాపు 16 ప్రధాన భాషలు, కొన్ని వందల మాండలికాలకు నెలవైన భారతదేశంలో వివిధ భాషల్లో టాకీ చిత్రాలు తయారవడం మొదలైంది. మొదట్లో అన్ని ప్రాంతాల వారికీ అర్థమయ్యేలా, హిందీ, ఉర్దూ కలగలిసిన హిందుస్థానీలో తొలి భారతీయ శబ్ద చిత్రాలు తయారయ్యేవి. ఆ తరువాత బెంగాలీలో 'జమాయ్ షష్ఠి' (1931), తమిళంలో 'కాళిదాస్' (1931– ఇందులో తెలుగు డైలాగులు, త్యాగరాజ కీర్తనలు ఉండడంతో, దీన్ని తొలి తమిళ, తెలుగు టాకీ అనేవారూ ఉన్నారు), తెలుగులో 'భక్త ప్రహ్లాద', మరాఠీలో 'అయోధ్యా చే రాజా' (1932), గుజరాతీలో 'నరసింహ మెహతా' (1932), కన్నడంలో 'సతీ సులోచన' (1934) చిత్రాలు ఆ యా భాషల్లో తొలి టాకీలుగా విడుదలయ్యాయి. 1931లో హిందీ, బెంగాలీ, తమిళ, తెలుగు టాకీలు తయారు కావడంతో, ఈ ఏడాది ఈ చిత్ర పరిశ్రమలన్నీ ఎనభై వసంతాలు జరుపుకొంటున్నాయి.

(తొలి భారతీయ టాకీ 'ఆలం ఆరా'కు ఎనభై వసంతాలు నిండుతున్న సందర్భంగా...)

- రెంటాల జూనియర్

నవ్వుల్ - పువ్వుల్

పుస్తకంలో...

మాస్టారు : సురేష్! మన దేశ రాజధాని ఏది?

సురేష్ : ప్రస్తుతానికి ఈ జవాబు నా మైండులో లేదు. నా పుస్తకంలో మాత్రం తప్పకుండా ఉంటుంది సార్.

పాము విషం



టీచర్ : రాజూ! పాము కాటేస్తే విషం ఎందుకు ఎక్కుతుంది?

రాజు : అవి పళ్లు తోముకోవు. అందుకని సార్.

కడిగా

తల్లి : రమ్యా! బియ్యం సబ్బు వాసన వస్తున్నాయేమిటి?

రమ్య : అందులో చిన్న చిన్న పురుగులు కన్పించాయమ్మా. అందుకే సబ్బుతో కడిగా.

ఎందుకు?

టీచర్ : మహేష్! చెరుకు ఎందుకు తియ్యగా ఉంటుంది?

మహేష్ : వాటిని పెంచేటప్పుడు చక్కెరతో కలిపిన నీళ్లు పోస్తారు టీచర్.

కొత్తమందు

రాము : ఏమండీ నేను విరిగిన ఎముకలకు కొత్త మందు కనిపెట్టాను.

శ్యాము : ఏంటది?

రాము : ఫెవిజల్. ఎముకలు విరిగిన చోట దాన్ని పూస్తే అతుక్కుంటాయి.

బాగానే

తండ్రి : పదోతరగతి పరీక్ష ఎలా రాశావురా?

కొడుకు : పెన్నుతో బాగానే రాశాను నాన్నా.

కలలో

మాధవ్ : డాడీ నేను హీరో రామ్‌చరణ్‌ను బైక్‌మీద ఎక్కించుకుని నడిపాను.

తండ్రి : ఎప్పుడురా?

మాధవ్: రాత్రి కలలో.

ఐడియా

టీచర్ : చింటూ! ప్లాస్టిక్ కవర్‌ను భూమిలో పెడితే నీళ్లు ఇంకుతాయా?

చింటూ : ఇంకుతాయి.

టీచర్ : ఎలా?

చింటూ : ఏముంది. వాటికి రంధ్రాలు చేస్తే సరి.

మౌనవ్రతం

గణేష్ : ఒరేయ్ రాజా! అక్కడేం చేస్తున్నావురా?

రాజా : మౌనవ్రతంలో ఉన్నానురా.

రేపటి పని

లోక్యా : ఏంట్రా ప్రవీణ్! ఇంత అన్నం తింటున్నావ్?

ప్రవీణ్ : మన పుస్తకంలోని పద్యంలో ఉంది కదరా! రేపు చెయ్యాల్సిన పనిని కూడా ఇప్పుడే చెయ్యాలని. అందుకే.

ఆర్. పంచారామ్, ఊట్‌పల్లి, బోధన్.

వానవేళ

తండ్రి : వాన బాగా కురుస్తున్నప్పుడు మీ స్కూల్లో పిల్లలు, టీచర్లు ఏం చేస్తారు?

కొడుకు : మా స్కూలు అసలే పాత భవనంలో వుంది. అది ఎక్కడ కూలిపోతుందోనని భయపడుతూ ఉంటాం డాడీ!!

లక్ష్యం

విలేకరి : నటులెవ్వరికీ పారితోషికం ఇవ్వకుండా సినిమా నిర్మిస్తున్నారు కదా. తదుపరి మీ లక్ష్యం ఏంటి?

నిర్మాత : రూపాయి ఖర్చు లేకుండా ప్రేక్షకులకు సినిమా చూపిద్దామనుకుంటున్నా.

జె.సుధాకర్ పట్నాయక్, కాకినాడ.

జోక్స్ బాగా వేస్తారా? మరైతే ఆలస్యం ఎందుకు! కార్డు మీద రాసి పంపండి. పాఠకులను కడుపుబ్బ నవ్వించండి. మా చిరునామా: స్నేహ, ప్రజాశక్తి దినపత్రిక, ఎం.హెచ్.భవన్, ప్లాట్‌నెం.21/1, ఆజామాబాద్, ఇండస్ట్రియల్ ఏరియా, హైదరాబాద్

కొత్త పుస్తకాలు

చరిత్రకు అద్దం పట్టిన నవల

మిఖైల్ షోలఖోవ్ రచించిన ప్రఖ్యాత రష్యన్ నవల "అండ్ క్వైట్ ఫ్లోస్ ది డాన్" నవలకు సంక్షిప్త పరిచయం ఈ "డాన్ నది ప్రవహిస్తూనే వుంది" పుస్తకం. మహీధర రామమోహనరావు ఈ నవలా పరిచయం చేశారు. 1852లో లియో టాల్‌స్టాయ్ (1828-1910) కూడా కోసక్కుల గురించి ఒక నవల రాశారు. మరొక రష్యన్ రచయిత "నికలోయ్ గొగోల్" (1809-1852) "తారాస్ బుల్బా" పేరుతో కోసక్కుల గురించే మరో నవల రాశారు. రష్యన్ సాహిత్యంలో ముగ్గురు ప్రముఖ రచయితలు కోసక్కుల గురించి నవలలు రాయటం విశేషం. రష్యా దక్షిణ పశ్చిమ ప్రాంతానికి చెందిన డాన్ నది తీరప్రాంతంలో నివసించిన "కోసక్కులు" గురించి ఈ నవల తెలియజేస్తుంది. కోసక్కులు సైనిక జాతికి చెందినవారు. అశ్విక నైపుణ్యానికి, వీరత్వానికి పేరుగాంచిన రష్యన్‌తెగవారు. సైన్యంలో చేరి శిక్షణ పొందటం వారి విధి. గుర్రాలను, ఆయుధాలను వారే సమకూర్చుకుంటారు. పచ్చిక మైదానాల్లో, రష్యన్ సామ్రాజ్య సరిహద్దుల్లో స్వేచ్ఛాయుత జీవితాన్ని కాంక్షించారు. జార్ చక్రవర్తుల నుంచి తమ సరిహద్దు రక్షణ సేవలకు గుర్తింపుగా కొన్ని



హక్కులు, ముఖ్యంగా స్వతంత్ర ప్రతిపత్తి సాధించుకున్నారు. అప్పటి రష్యా సరిహద్దుల్లోని కాకసస్ పర్వత ప్రాంతాల్లో వుండేవాళ్ళు. బోల్షివిక్ విప్లవాన్ని ఆహ్వానించిన వారే తర్వాత దానికి వ్యతిరేకంగానూ కొంత కాలం పోరాడతారు. దీని వెనక బలీయమైన రాజకీయ చారిత్రిక కారణాలున్నాయి. ఈ విధంగా 1913 నుండి 1924 వరకూ రష్యన్ విప్లవం, అంతర్‌యుద్ధ సమయంలో డాన్ నదీ ప్రాంతంలో నివసించిన కోసక్కుల కథ ఈ నవలలో వర్ణించబడింది. ఎర్రసేనలకు (రెడ్‌గార్డ్స్) తెల్లసేనలకు (వైట్‌గార్డ్స్) మధ్య నాలుగేళ్ళపాటు జరిగిన అంతర్‌యుద్ధ కాలపు కల్లోలాన్ని ఈ నవల చిత్రిస్తుంది. రాజకీయ సైనిక ఘర్షణలతో పాటు కుటుంబాలలోనూ వ్యక్తుల ఆలోచనల్లోనూ ఆ కల్లోలం ప్రతిధ్వనులను షోలఖోవ్ అద్భుతంగా ప్రతిబింబించారు. స్టాలిన్ హయాంలో ఈ నవల ప్రచురితమైంది. అయితే మొదట్లో ఈ నవలపై అపార్థాలు తలెత్తితే మాగ్జిం గోర్కి జోక్యం చేసుకుని ప్రచురణకు కృషి చేశారు. ప్రపంచ నవలల చరిత్రలో ప్రామాణికంగా పరిగణించబడే కొన్ని పుస్తకాల్లో ఇదొకటి. డాన్ నది తీరంలో నడిచిన చారిత్రిక పరిణామాలను తన అనుభవంలో షోలకోవ్ అక్షరీకరించారు. చిన్న వయసులోనే ఎర్ర సైనికుడుగా వుండి తెల్లసైనికుల చేతుల్లో చిక్కి బయటపడిన ఆయన "డాన్ మహాకావ్యం" అంటూ ప్రారంభించిన నవల క్రమేణా విస్తరించి నాలుగు భాగాల బృహత్తర రూపం తీసుకుంది. హైదరాబాద్ బుక్‌ట్రస్టు వారు మొదట ప్రచురించిన ఈ పరిచయాన్ని ప్రజాశక్తి బుక్‌హౌస్ తిరిగి ముద్రించింది.

డాన్ నది ప్రవహిస్తూనే ఉంది,
మహీధర రామమోహనరావు,
వెల : 35/-, పేజీలు : 85,
ప్రతులకు : ప్రజాశక్తి బుక్ హౌస్, 1-1-187/1/2,
చిక్కడపల్లి, హైదరాబాద్ 20.

యువతకు ఆదర్శం

ఆంధ్రప్రదేశ్‌లో కమ్యూనిస్టు ఉద్యమాన్ని ప్రారంభించినవారిలో పులుపుల వెంకట శివయ్య ఒకరు. గుంటూరు జిల్లా వినుకొండకు చెందిన శివయ్య శుద్ధ వైదిక సనాతన సాంప్రదాయక కుటుంబంలో పుట్టి వున్నత చదువులకోసం బెనారస్ హిందూ విశ్వవిద్యాలయానికి వెళ్ళారు. అక్కడ విప్లవభావాలతో ప్రభావితమై స్వస్థలానికి వచ్చి చివరివరకు కమ్యూనిస్టు ఉద్యమానికి అంకితమైన వ్యక్తి పులుపుల వెంకట శివయ్య. 1937లో గుంటూరు జిల్లా కమ్యూనిస్టు పార్టీ కార్యదర్శిగా పనిచేశారు. 1937-38లో నిర్వహించిన కొత్తపట్నం, మంతినవారిపాలెం పాఠశాలలకు ప్రిన్సిపాల్‌గా వ్యవహరించారు. 1952,1962లలో రెండుసార్లు వినుకొండ నుండి కమ్యూనిస్టుపార్టీ తరపున శాసనసభ్యునిగా పనిచేశారు. 1952 నుండి రెండు సార్లు వినుకొండ పంచాయితీ సర్పంచ్‌గా వున్నారు. అటు కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాణంలో, ఇటు సాహితీరంగంలో రెండువైపుల వెంకట శివయ్య కృషిచేశారు. అభ్యుదయ రచయితల సంఘం ఏర్పాటుకు 1943లో జరిగిన ప్రయత్నంలో శివయ్య పాత్ర కూడా వుంది. వేములపల్లి శ్రీకృష్ణ "చెయ్యెత్తి జైకొట్టు తెలుగోడ" గీతం రాసినట్టుగానే పులుపుల వెంకట శివయ్య, 'పలనాడు వెలలేని మాగాణిరా' అనే గీతం రాశారు. నందికొండ సాధన ఉద్యమం కమ్యూనిస్టుపార్టీ నడుపుతున్న సందర్భంగా ఈ గీతం బహుళ ప్రచారమయింది. అభ్యుదయ రచయితల సంఘాన్ని నిర్మించడంలో శివయ్య ప్రధానమైన పాత్ర నిర్వహించారు. ఆంధ్రరాష్ట్రంలో అభ్యుదయ సాహిత్యాన్ని సంఘసంస్కరణోద్యమాన్ని ముందుకు తీసుకెళ్ళడంలో గురజాడ, కందుకూరి, గిడుగు లాంటి పాతతరం కృషిని కొనసాగించడంలో 1940వ దశకంలో కమ్యూనిస్టుపార్టీ ముఖ్యమైన ప్రాత నిర్వహించింది. కందుకూరి వీరేశలింగం చేసిన ప్రయత్నాన్ని, రచనలను పరిశీలించడంకోసం మాకినేని బసవపున్నయ్యతో కలసి పులుపుల వెంకట శివయ్య రాజమండ్రి వెళ్ళి వచ్చిన విషయాలు కూడా ఈ పుస్తకంలో చోటుచేసుకున్నాయి. పులుపుల వెంకట శివయ్యగారి శిష్యునిగా ఉండి ప్రస్తుతం అభ్యుదయ రచయితల సంఘం రాష్ట్ర అధ్యక్షుడుగా ఉన్న పెనుగొండ లక్ష్మీనారాయణ ఈ పుస్తకాన్ని కూర్చారు. శతజయంతి సందర్భంగా పులుపుల వెంకట శివయ్య జీవిత చరిత్రను, ఆయన వ్రాసిన వ్యాసాలను ఈ పుస్తకంలో మనం చదవొచ్చు. తను సన్నిహితంగా వుండి పరిశీలించిన శివయ్య జీవితాన్ని రాయడమేకాక శివయ్య రచించిన సాహితీవ్యాసాలు, కవితలు ఈ పుస్తకంలో వున్నాయి. విశాలాంధ్ర బుక్‌హౌస్ ప్రచురించిన ఈ పుస్తకాన్ని అభ్యుదయవాదులు తప్పనిసరిగా చదవాలి.

నూరేళ్ల పులుపుల, పెనుగొండ లక్ష్మీనారాయణ,
వెల : 40/-, పేజీలు : 81,
ప్రతులకు : విశాలాంధ్ర అన్ని బుక్ హౌసులు.

- కారుసాల

చూద్దామా



అక్కడ ఏనుగులే హీరోలు

భారీ ఆకారం... స్నేహపూర్వకంగా పైకెత్తి ఆశీర్వదించే తొండం... అంటే చాలు! నిలువెత్తు గజరాజు రూపం మన మదిలో నిలిచిపోతుంది. హుందాగా, తాపీగా, నడుస్తూ ప్రశాంతంగా, ఎంతో బుద్ధిమంతుల్లా ఉండే ఏనుగులు కోపం వస్తే మాత్రం రౌడీలకు మారు రూపంలా ప్రవర్తిస్తాయి. అటువంటి గజరాజులు ఆటలపోటీల్లో పాల్గొంటే ఎలా ఉంటుందో ఓ సారి ఊహించుకోండి. ఏంటీ ఏనుగులకు ఆటల పోటీలా! అని ఆశ్చర్యపడుతున్నారా? నిజమే... అక్షరాలా గజరాజులే. రేసులో, పోలో ఆటలో పాల్గొంటున్నాయి. ఇది ఎక్కడో కాదు! రాజస్థాన్ రాష్ట్రంలోని పింక్‌సిటీ జైపూర్‌లో... అక్కడ ఏనుగులే హీరోలు. మరి ఆ సందర్భం ...ఆ విశేషాలు ఏవిటో చూద్దామా!

హోలీ పండుగ సందర్భంగా అక్కడ ఏనుగుల మీద కూర్చుని పోలో ఆట ఆడతారు. ఆ పండుగ రోజు ఏనుగులను రంగు రంగులు వస్త్రాలతో అలంకరిస్తారు. అవన్నీ ఒకేసారి కదిలొస్తుంటే ఇంద్రధనుస్సే ఇలా ఏనుగుల రూపంలో భూమ్మీద నడిచొస్తుందా అనిపిస్తుంది. విశాలమైన పచ్చిక బయలులో ఏనుగు మీద క్రీడా వినోదం మరపురాని అనుభూతిని మిగులుస్తుంది.

ఇప్పటిది కాదు...

గజరాజుల మీద క్రీడా వినోదం ఒకప్పుడు రాజరికపు క్రీడగా విలసిల్లింది. అప్పట్లో రాజులు ఏనుగుల మీద యుద్ధాల్లో పాల్గొనడం, వేటకెళ్లడం చేసేవారు. ఏనుగుల అంబారీ కట్టించుకోవడం గొప్పగా ఉండేది. కాలగర్భంలో రాజరికాలు మరుగున పడిపోయాయి. పెద్దసంఖ్యలో ఏనుగుల్ని పెంచిపోషించటాలూ లేవు.

తగ్గుతున్న గజరాజుల సంఖ్య

ఏనుగు దంతాలకు అంతర్జాతీయ మార్కెట్లో ఉన్న విలువ దృష్ట్యా ఏనుగులను చంపడం ఎక్కువైంది. ప్రపంచవ్యాప్తంగా ఈ గజరాజుల వధ కారణంగా ఏటా వీటి సంఖ్య తగ్గిపోతోంది. జైపూర్‌లో మాత్రం సందర్శకుల్ని ఆకట్టుకునేందుకు రాజస్థాన్ టూరిజం శాఖ ఏనుగులమీద క్రీడావినోదాల ఏర్పాట్లు చేసింది.

అప్పట్లో...

సంప్రదాయ రాజస్థాన్ వాయిద్యబాణీని 'బాద్వా' అని వ్యవహరిస్తారు. ఇదివరలో 'దంగాల్స్' అని పిలిచే రెజ్లింగ్ పోటీలప్పుడు ఏనుగుల యుద్ధాలు, ఎద్దుల పోటీలు, గాలిపటాల పందాలు నిర్వహించేటప్పుడు బాద్వా ట్యూన్‌లో ప్రేక్షకులకు ఆహ్వానం పలకటం సంప్రదాయంగా ఉండేది. పునరుజ్జీవనం పొందిన ఏనుగుల క్రీడావినోద సంబరాల సమయంలో అదే ట్యూన్‌ని ఇప్పుడూ వాడుతుడడం విశేషం. ప్రఖ్యాతి చెందిన నహర్ ఫోర్ట్ ప్రాంతంలో ఇప్పుడు క్రీడాపోటీలు నిర్వహిస్తున్నారు.

టూరిజం శాఖ ప్రయోగం

1980 మార్చి 25 తేదీన రాజస్థాన్ వినోద పర్యాటకశాఖ సరికొత్త ప్రయోగం చేసింది. జైపూర్ నగరం మధ్యలోని చౌగన్ స్టేడియంలో రాజవైభవాన్ని గుర్తు తెచ్చే ఏనుగుల క్రీడా వినోదాన్ని ఏర్పాటు చేసింది. చరిత్ర పుటల్లో మరుగున పడిన ఈ క్రీడకు పునరుజ్జీవనం కల్గించే ప్రయత్నం అనూహ్యరీతిలో విజయవంతమయింది. ప్రేక్షకులకు కొత్త అనుభవాన్ని, సరికొత్త వినోదాన్ని రుచిచూపించింది. అప్పట్నుంచి ఏటేటా గజక్రీడల ఏర్పాటు కొనసాగుతూ వస్తోంది. ఈ వినోదం చూడడానికి హాజరయ్యే వేలకొద్దీ ప్రేక్షకుల్లో విదేశీయులూ పెద్ద సంఖ్యలో పాల్గొంటారు.

హోలీ సందడిలో...

హోలీ పండుగ సందర్భంగా జైపూర్ మరింత అందంగా ముస్తాబవుతుంది. సరదాగా సాగే రంగుల పండుగ అక్కడ ప్రత్యేకత సంతరించుకుంటుంది. ఆ రోజు నగరంలో ఎక్కడ చూసినా రంగుల సందడే. చౌగన్ స్టేడియంలోనైతే

ఏనుగులు బారులు తీరి చూపరులకు ఉత్సాహాన్ని కలిగిస్తాయి. అక్కడ ఎటువైపు చూసినా రంగుల హరివిల్లులే కన్పిస్తాయి.

మార్చ్‌ఫాస్ట్ దర్శనం...

ఏనుగుల్ని అలా ఓ క్రమ పద్ధతిలో నిలబెట్టడమంటే మాటలు కాదు. దీనికి ఎంతో ఓర్పు ఉండాలి. చాలా కష్టంతో కూడుకున్న పని. ఆ ప్రతిభంతా మావటివాళ్లకే చెందుతుంది. చాలా నేర్పుతో వ్యవహరిస్తారు. కొట్టొచ్చినట్లు కన్పించే రంగులతో ఏనుగుల్ని ప్రత్యేకంగా అలంకరిస్తారు. దానికి తోడు రంగురంగుల దుస్తులు, ఆభరణాలూ ఉండనే ఉంటాయి. ఇలా అందంగా తయారైన ఏనుగుల్ని చూడాలనే ఉత్సాహంతో జనం ఎగబడతారు. మావటివాళ్ల అంకుశంతో హెచ్చరిస్తుండగా, బ్యాండుమేళాల నేపథ్యంలో ఏనుగులు చేసే మార్చ్‌ఫాస్ట్ చూడాల్సిందే తప్ప చెప్పలేం. ఏనుగు కవాతుతో జనంలో హుషారు కదం తొక్కుతుంది. ఏనుగుల మార్చ్‌ఫాస్ట్ సంబరంలోనే ఉత్సాహవంతులైన రాజస్థానీయులు సంప్రదాయ అలంకరణలతో బృందాలుగా ఏర్పడి కవాతు సంబరంలో పాల్గొంటారు.

బహుమతులూ ఉన్నాయి

చక్కగా అలంకరణ చేసుకున్న ఏనుగుకు బహుమానం కూడా ఇస్తారు. రకరకాల డిజైన్లు, అలంకరణలతో "ఏనుగులు ఇంత ముద్దొస్తాయా!" అన్పించేలా వాటిని తయారు చేస్తారు. ఏనుగులన్నింటిలోనూ మెరుగన్పించిన మూడింటిని వేరుచేసి, మొదటి మూడు స్థానాలని విడివిడిగా నిర్ణయిస్తారు. ఒకవైపు ఏనుగులకు అలంకరణ ముచ్చట్లు సాగుతుంటే మరోవైపు స్టేడియంలో జనసందోహం కోలాహలం మిన్నుముడుతుంది. ఏనుగుల అలంకరణల పోటీలు ఓ కొలిక్కి వచ్చాక ఎలిఫెంట్ పోలో జరుగుతుంది.

ఏనుగులపై పోలో ఆట...

ఏనుగులు తాపీగా, హుందాగా పెళ్లి నడకలు నడుస్తుంటే వాటిపై ఎక్కి పొడవాటి స్టిక్‌లతో బంతిని కొట్టేందుకు ఆటగాళ్ల పడేపాట్లు చూస్తుంటే నవ్వొస్తుంది. జట్టుకి ముగ్గురు చొప్పున ఏనుగుల మీద ఆటగాళ్లు బరిలోకి దిగుతారు. ఈ ఆటలో పొడవాటి కర్రల్ని అతినైపుణ్యంగా, జాగ్రత్తగా వాడాల్సి వస్తుంది. ఒక్కోసారి అందుబాట్లో ఉన్న బంతిని ఏనుగు తన తొండంతో దొరకపుచ్చుకుని దూరంగా విసిరేస్తుంది. అలాంటప్పుడు ఆటగాళ్లను చూస్తే అయ్యో పాపం... అనిపిస్తుంది. అంతేకాదు, వీక్షకులు కడుపుబ్బ నవ్వుకుంటారు కూడా. పోలో ఆడే జట్లకి కేసరియా, కనుమల్ అనే పేర్లు పెడతారు. అక్కడి రొమాంటిక్ పద్యాల్లో వాడే సంప్రదాయ రంగుల పేర్లు అవి. విజేతను నిర్ణయించేందుకు ఒక అంపైర్‌ను నియమిస్తారు. ఆయనగారు కూడా మైదానంలో ఏనుగుమీదే తిరుగాడుతూ ఉంటాడు. ఈ పోటీ ముగిశాక నిర్వహించే రేస్‌కోసం ప్రేక్షకులు ఆత్రుతగా నిరీక్షిస్తుంటారు.

వండర్‌ఫుల్ రేస్

రేస్ ప్రారంభంలో ఏనుగుల్ని ఒక వరుసలో నిలబెట్టడం ఓపికతో కూడుకున్న పని. ఓ పట్టాన అవి మాట వినవు. అభిమానుల కేకలతో, ఈలలతో రెచ్చిపోయి ముందుకురికే ఏనుగుల్ని ఆపడం మరింత కష్టమవుతుంది. రేసు ప్రారంభం కాగానే స్టేడియమంతా అరుపులతో, అల్లరితో దద్దరిల్లిపోతుంది. ఏనుగుల రేసు అరుదుగా జరగడం వల్ల ప్రత్యేకంగా దీన్ని చూడ్డానికి ఎక్కువమంది అక్కడికి వస్తారు. ఒక్కసారిగా ఆరు ఏనుగులు రేసులో ముందుకు అడుగు కదుపుతాయి. అందులో పాల్గొనే ఏనుగులకు గులాబీ, చంప, చమేలీ, అనార్కలీ... అంటూ పేర్లు పెడతారు. రేసులో పాల్గొన్న అన్నింటిలోనూ మూడింటిని ఎంచి, ఫైనల్ రౌండ్‌లో వాటికి మళ్లీ పోటీ నిర్వహిస్తారు. ఆసియాడ్‌లోనూ, ఒలింపిక్స్‌లోనూ నిర్వహించే వందమీటర్ల పరుగుపందానికి ఇవేం తీసిపోవు.

రంగుల ప్రపంచం....

ఆ తర్వాత స్టేడియమంతా రంగులు వెల్లువలా కురుస్తాయి. ప్రేక్షకులూ, ఆటగాళ్లూ, హాజరయిన ముఖ్యులూ అందరూ తారతమ్యం లేకుండా హోలీ ఆడతారు. కొందరు ఏనుగుల్ని ఎక్కి స్టేడియం అంతా కలియదిరుగుతూ రంగులు జల్లుకోవడం కన్పిస్తుంది. విదేశీయులు కూడా ఈ కార్యక్రమంలో ఉత్సాహంగా పాలుపంచుకుంటారు. మొత్తమ్మీద అదో రంగుల కలలాంటి అనుభవం. కార్యక్రమం చివర్లో ప్రదర్శించే జానపదనృత్యం అందరూ తప్పకుండా చూడాల్సిన అంశం. ఆ కార్యక్రమానికి జానపద కళాకారుల ప్రదర్శన గొప్ప వెలుగు. ఛాంగ్, ఢాప్ అని పిలిచే వాయిద్యాలతో వారు పాడే హోలీ పాటలు అక్కడి వాతావరణానికి ప్రత్యేకతను తీసుకొస్తాయి. పొడవాటి కోటు, తల పాగా, గుబురు మీసాలతో సంప్రదాయ దుస్తుల్లో జానపద కళాకారులు ప్రదర్శనను రక్తికట్టిస్తారు. ఒంటెలు, పల్లకీలు అందులో భాగమవుతాయి.

చరిత్ర విశేషాలు

స్థానిక సిటీ ప్యాలస్ మ్యూజియంలో గతకాలపు గజవినోదం వివరాలు లభ్యమవుతాయి. అప్పట్లో పాలకులు, రాజవంశీయులు ఏనుగులపై సవారీ చేస్తూ వేటాడ్డం, యుద్ధం చేయడమంటే మక్కువ కనబరిచేవారు. ఒకనాడు ఏనుగులపై వేట వినోదమయితే నేడదే ఏనుగులతో క్రీడ ప్రమోదమైంది. చరిత్రను కొత్తరూపంలో పరిచయం చేసిన టూరిజంశాఖ ప్రయత్నం అభినందనీయం. రాజుల కాలంనాటి కాలక్షేపం పర్యాటకశాఖ వారి ప్రయోగంగా మారింది. సంప్రదాయతను పుణికిపుచ్చుకుని, ఆధునికతను సంతరించుకుని ఏనుగుల క్రీడలు నవీన ప్రపంచంలో సరికొత్త వినోదానికి అవకాశం కల్పిస్తున్నాయి.

బహుమతి ప్రదానం

పోటీల ముగింపులో విజేతలకు బహుమతి ప్రదానం జరుగుతుంది. ఏటేటా వివిధ పోటీల్లో వేర్వేరు ఏనుగులు విజేతలు కావచ్చు. కానీ ఇటువంటి సంబరాలను సమర్థవంతంగా నిర్వహించగలిగే రాజస్థాన్ టూరిజం విభాగం సిబ్బంది అసలైన విజేతలుగా నిలుస్తారు. ★



'అమ్మో వైద్యమా! ఆ ఆసుపత్రుల బిల్లులూ, డాక్టర్ల ఫీజులూ, మందుల ఖర్చూ... ఎక్కడ తట్టుకుంటాం బాబూ' అనుకోవాల్సిన రోజులివి. మందుల బిల్లు చూస్తే చాలు బావురు మనాల్సిన కాలమిది. అటువంటిది బయటి మార్కెట్లో ఐదు రూపాయల ధర పలికే మందుబిళ్ల 77 పైసలకే అందుబాటులో వుంటే! 75 రూపాయల ధర పలికే మందు 23.89 పైసలకే లభిస్తుంటే... ఎలా వుంటుంది? సామాన్యులు, మధ్యతరగతి జీవులకు ఎంతో ఊరటగా వుండదూ! తమ చిరు బడ్జెట్‌లో మందుల ఖాతాకోసం వెచ్చించాల్సిన డబ్బు మిగిలినందుకు సంతోషంగా వుండదూ!! మరి ఇంత చవగ్గా మందులమ్మే దుకాణమేదంటే... అపర 'సంజీవని'గా పేదల మన్ననలు అందుకుంటున్న జీవనధార-సంజీవని ఫార్మశీ. మన రాష్ట్రంలో విశాఖ, విజయవాడ, హైదరాబాద్, పశ్చిమగోదావరిలో ఇతోధికంగా సేవలందిస్తోంది. మరి ఆ వివరాలు ఈ వారం అట్టమీది కథలో...

అపర 'సంజీవని'

మన దేశంలోనే కాదు...విదేశాల్లోనూ జనరిక్ మందుల అమ్మకాలు ప్రాచుర్యంలో ఉన్నాయి. బంగ్లాదేశ్‌లో జనరిక్ మందుల విధానం వుంది. మన దేశంలో రాజస్థాన్‌లోని చిత్తోర్‌గఢ్, ఆల్వాల్, జైపూర్, ఢిల్లీ, పంజాబ్, హర్యానాలో కొనసాగుతోంది. మన రాష్ట్రంలో ఈ జనరిక్ మందుల అమ్మకాలకు బీజం పడింది మాత్రం విశాఖలోనే. మందులు తక్కువ ధరకే సామాన్యులకు అందుబాటులో ఉండాలన్న సంకల్పంతో విశాఖజిల్లా కలెక్టర్ జె.శ్యామలరావు 2010 జనవరి 24న జనరిక్ మందుల అమ్మకాలకు శ్రీకారం చుట్టారు. జిల్లా మహిళా సమాఖ్య, ఇందిరాక్రాంతి పథం నేతృత్వంలో 333 రకాల నిత్యవసర మందులను జీవనధార-సంజీవని షాపుల్లో లభ్యమయ్యేలా ఏర్పాటుచేశారు. 50 నుంచి 90 శాతం రాయితీతో జనరిక్ మందులను సంజీవనిలో అమ్ముతున్నారు. 80 సర్జికల్ ఐటమ్స్ (ఆపరేషన్లకు వినియోగించేవి) అందుబాటులో ఉన్నాయి. క్యాన్సర్, ఎయిడ్స్, లెప్రసీ, టీబీ తదితర వ్యాధులకు ఉచితంగానే మందులు అందిస్తున్నందున, అవి మినహా మిగిలిన అన్ని వ్యాధులకు అవసరమైన మందులు జీవనధార సంజీవని ఫార్మసీలో లభ్యమవుతున్నాయి. నాన్‌జనరిక్ మందులు విక్రయించడం లేదు. ప్రస్తుతం రాష్ట్రంలో జీవనధార సంజీవని ఫార్మశీ, జన ఔషధి పేరుతో జనరిక్ మందులను విక్రయిస్తున్నారు. మందుల విధానం ఉనికిలోకి వచ్చినప్పట్నుంచీ ఈ జనరిక్ మందులున్నాయి. తగిన ఆదరణ లభించకపోవడంతో బ్రాండెడ్ కంపెనీ మందులే మార్కెట్లో చలామణి అవుతున్నాయి.

ఆంధ్రప్రదేశ్‌లో విశాఖపట్నం జిల్లాలో ఏడు చోట్ల(కెజిహెచ్, అనకాపల్లి, చోడవరం, నర్సీపట్నం, అడ్డురోడ్డు, తగరపువలస, పెందుర్తి), హైదరాబాద్ నిమ్స్, విజయవాడ హెల్త్ యూనివర్శిటీ, ఏలూరు, తాడేపల్లిగూడెం వంటి చోట్ల జనరిక్ మందులు లభ్యమవుతున్నాయి. అయితే మందుల సేకరణ అనేది ప్రధాన సమస్యగా ఉండడం, ప్రజలకు వీటిపై సంపూర్ణ అవగాహన లేకపోవడం వల్ల కుంటి నడకన నడుస్తున్నాయి. ఈ సేకరణ, సరఫరాకు సంబంధించి నిరంతరం ప్రజల్లో అవగాహన కల్పించి విజయవంతంగా నిర్వహిస్తున్నది విశాఖ జిల్లాలోనే. డ్వాక్రా మహిళలు, డిఆర్‌డిఎ సంయుక్తంగా కంపెనీల నుండి నేరుగా జనరిక్ మందులు సరఫరా అయ్యేటట్లు కలెక్టర్ శ్యామలరావు చొరవ తీసుకున్నారు. దీనికి సంబంధించి ప్రతి మూడు, నాలుగు నెలలకు ఒకసారి సమావేశాలు ఏర్పాటుచేస్తున్నారు. ఇక్కడ రోగులను దృష్టిలో పెట్టుకొని జనరిక్ మందుల సేకరణను పెంచుకుంటూ వస్తున్నారు. జీవనధారకు మందుల కొనుగోళ్లు, నిర్వహణ బాధ్యత డిఆర్‌డిఎ - ఇందిర క్రాంతిపథం జిల్లా సమాఖ్య చూస్తోంది. ఔషధ నియంత్రణ విభాగం సహాయ సంచాలకులు రావి ఉదయభాస్కర్, డిఆర్‌డిఎ పథకం సంచాలకులు శ్రీకాంత్ తదితరులతో ఏర్పాటైన కమిటీ సంజీవని ఫార్మశీల ఏర్పాటు, పర్యవేక్షణలను చూస్తోంది. కొనుగోలు చేసిన మందులను 10శాతం నుంచి 15శాతం లాభాలకు విక్రయిస్తున్నారు. లాభంగా వచ్చిన సొమ్మును ఫార్మశీల నిర్వహణకు వినియోగిస్తున్నారు. పశ్చిమగోదావరి జిల్లా మహిళా సమాఖ్య, డిఆర్‌డిఎ సంయుక్త ఆధ్వర్యంలో తాడేపల్లిగూడెం ఏరియా ఆస్పత్రిలో సంజీవని ఫార్మశీ ఏర్పాటైంది. ఇక్కడ విక్రయిస్తున్న మందులు పట్టణంలోని మందుల దుకాణాల్లోని ధరల కంటే సుమారు 60 శాతం నుంచి 80 శాతం వరకు తక్కువకు అమ్ముతున్నారు. ఇక్కడ 200 రకాల ఔషధాలను విక్రయిస్తున్నారు. కిడ్నీ, థైరాయిడ్ వ్యాధులకు సంబంధించిన మందులు మినహా మిగిలిన అన్ని రకాల మందులూ ఇక్కడ

అందుబాటులో ఉన్నాయి. రాష్ట్రంలోని ఎనిమిది ఔషధ తయారీ కంపెనీల నుంచి నేరుగా తయారీ ధరకే మందులు సరఫరా అయ్యేటట్లు ఒప్పందం కుదుర్చుకున్నారు. సంజీవని ఫార్మశీలు కృష్ణాజిల్లాలో మూడు చోట్ల ఉన్నాయి. విజయవాడలోనే రెండు పార్మశీ సెంటర్లు ఉన్నాయి. ఒకటి పాత ప్రభుత్వాసుపత్రి ప్రాంగణంలోనూ, రెండవది కొత్త ప్రభుత్వాసుపత్రి ప్రాంగణంలోనూ ఉంది. మూడవది మచిలీపట్నంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో ఉంది. జిల్లా మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో ఫార్మశీని ఏర్పాటుచేశారు. డిఆర్‌డిఎ పి.డితోపాటు, జిల్లా ఔషధ నియంత్రణా మండలి దీనిని పర్యవేక్షిస్తుంది. జిల్లా కలెక్టర్ కూడా ఫార్మశీకి సంబంధించిన తగిన ప్రోత్సాహం ఇవ్వడంతో పాటు దీనిపై అధారిటీ ఉంటుంది. ఇక్కడ సుమారు 280 రకాల మందులు లభ్యమవుతున్నాయి. బయటి మందులకు, సంజీవని ఫార్మశీ మందులకు ధరలో 30 నుంచి 90 శాతం దాకా వ్యత్యాసం వుంది. కంపెనీలను నుంచి తెప్పించే మందులపై సంజీవని ఫార్మశీలో ఐదు శాతం మార్జిన్ తీసుకుంటారు. దీన్ని ఫార్మశీ నిర్వహణకు, ఉద్యోగుల జీతభత్యాలకు వాడతారు. హైదరాబాద్ నిమ్స్‌లోని 'జన ఔషధి'లో ఏడాదినుంచి జనరిక్ మందులు అందుబాటులో వున్నాయి. కేంద్ర ప్రభుత్వ రంగ ఫార్మా కంపెనీల నుంచి వీటికి మందులు సరఫరా అవుతాయి. ఇక్కడ ధరలు బయటి ధరలతో పోల్చుకుంటే దాదాపు 30 శాతం నుంచి 100 శాతం వరకు తక్కువగా ఉంటాయి. ఉదాహరణకు అప్రోఫ్లోక్సాసిన్ 10 మాత్రల స్ట్రిప్ బయట రూ.60 నుంచి రూ.70 వరకు ఉంటుంది. జన ఔషధిలో దీని ధర కేవలం రూ.21.50 పైసలు మాత్రమే. అదేవిధంగా డోన్‌పెరికాన్ పది మాత్రలు బయట రూ. 25, జన ఔషధిలో కేవలం రెండు రూపాయల 30 పైసలు. ఇలా బయటి మందులకు జన ఔషధి మందులకు ధరలో తేడా ఉంటుంది. ఇక్కడ ప్రస్తుతం యాంటిబయోటిక్, పెయిన్ కిల్లర్స్ (నొప్పుల మాత్రలు) సహా దాదాపు 25 నుంచి 30 రకాల మందులు అందుబాటులో ఉన్నాయి. అయితే ఇక్కడ నిర్వహణ సరిగా లేదనే విమర్శలూ వెల్లువెత్తుతున్నాయి.

జీవనధార-సంజీవని ద్వారా విశాఖలోని కెజిహెచ్‌లో రోజుకు 30 వేల రూపాయల వరకు జనరిక్ మందుల అమ్మకాలు జరుగుతున్నాయి. ఏడాది టర్నోవర్ కెజిహెచ్‌లో 58 లక్షలా 49 వేల రూపాయలు, పెందుర్తిలో రూ.20 లక్షలు, తగరపువలసలో 9 లక్షలా 82 వేల రూపాయలు, ఎస్.రాయవరంలో రెండు లక్షలా 25 వేలు, చోడవరంలో రెండు లక్షలా 47 వేల రూపాయలు, నర్సీపట్నంలో లక్షా 56 వేల రూపాయల అమ్మకాలు జరుగుతున్నాయి. సంవత్సరం క్రితం ఏలూరులో ఫార్మసీ అమ్మకాలు ప్రారంభించినప్పుడు రోజుకు రూ.వెయ్యి నుంచి రూ.1200 వరకూ అమ్మకాలు సాగేవి. ప్రస్తుతం రోజుకు పది వేల నుంచి రూ.12 వేలు వరకూ అమ్మకాలు సాగిస్తున్నారు. జిల్లాలోని సంజీవని ఫార్మశీలన్నీ జిల్లా కోఆర్డినేటర్ టి.సూర్యారావు ఆధ్వర్యంలో, డ్రగ్ ఇన్‌స్పెక్టర్ల పర్యవేక్షణలో పని చేస్తున్నాయి. ఈ ఫార్మసీలో ఒక ఫార్మాసిస్టును, ఒక అసిస్టెంట్ ఫార్మాసిస్టును నియమించారు. వీరు ప్రభుత్వాసుపత్రికి వచ్చే రోగులతో మాట్లాడి సంజీవని ఫార్మశీ విషయమై వారిలో అవగాహన కల్పిస్తున్నారు. ప్రభుత్వాసుపత్రిలో లేని మందులను ఈ సంజీవని ఫార్మశీలోనే కొనుగోలు చేయాలని ప్రభుత్వాసుపత్రి వైద్యులు రోగులకు సూచిస్తున్నారు. సంజీవని ఫార్మశీ ప్రారంభంలో ఇక్కడ మందులను తక్కువ ధరలకు ఇస్తారనే విషయం చాలా మందికి తెలియదు. అనంతర కాలంలోనే దీని గురించి తెలిసింది.

ప్రభుత్వమే విస్తరించాలి

2020 నాటికి ప్రపంచ సుగర్ వ్యాధిగ్రస్తులలో అత్యధిక శాతం భారతదేశంలో ఉండబోతున్నట్లు అంచనా. అనేక రోగాలతో బాధపడుతున్న లక్షలాది మంది భారతీయులకు ప్రభుత్వమే పూనుకుని చేయూతనివ్వాలి. మందుల ధరల నియంత్రణ, విదేశీ కంపెనీల చొరబాటు - మందుల కంపెనీల్లో ప్రత్యక్ష పెట్టుబడుల నియంత్రణ, ప్రభుత్వరంగ మందుల కంపెనీల పునరుద్ధరణగావించాలి. అత్యవసర, నిత్యవసర మందులు సామాన్యుడికి అందుబాటులో ఉంచే సంజీవని లాంటి పథకాలను ప్రభుత్వమే ప్రారంభించి విస్తరించాలి. దానికి సంబంధించి జనరిక్ మందులపై ప్రజల్లో ఉన్న అపోహను తొలగించేలా ప్రచారం చేపట్టాలి. అవసరమైన మందుల సరఫరా నిరంతరం కొనసాగించే విధంగా చర్యలు తీసుకున్నప్పుడు సగటు మనిషికి ఎంతోకొంత ఉపశమనం కల్గుతుంది.

-తుర్లపాటి కామేశ్వరరావు,

జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కమిటీ సభ్యులు.

జనరిక్ మందులంటే ఏంటి?

మందుల మూలపదార్థాలు. ఉదాహరణకు...సిప్రోఫ్లాక్సిన్ ఓ యాంటిబయాటిక్ జనరిక్ నామం. అదే బ్రాండ్ పేరైతే సిప్రాన్, సిఫ్లాక్స్, సిప్రోలెట్. నాణ్యమైన, మందుల తయారీలో మంచి సామర్థ్యం కల్గిన జనరిక్ మందులను అతి తక్కువ ధరలకు నిరుపేద ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడానికి ఉద్దేశించినవి జనరిక్ మందులు. సాధారణంగా ఏదైనా మందులను ఒక కంపెనీ రీసెర్చ్ చేసి తయారు చేస్తే సంబంధిత మందులపై ఆ కంపెనీకి పేటెంట్ హక్కు ఉంటుంది. ఆ కంపెనీకి మాత్రమే వాటిని తయారు చేసే హక్కు, మార్కెట్లో అమ్ముకునే హక్కు ఉంటుంది. పేటెంట్ కాలం దాటాక ఆ మందులను ఏ ఇతర కంపెనీ అయినా తయారు చేయొచ్చు, మార్కెట్లో అమ్ముకోవచ్చు. ఈ తరహా మందులనే జనరిక్ మందులు అంటారు.

ఎందుకని చవక?

జనరిక్ మందులు భారతదేశ కంపెనీలు తయారు చేసినవి కావడంతో ఎంతో కొంత చౌకగా దొరుకుతున్నాయి. మన భౌగోళిక పరిస్థితులు, శీతోష్ణస్థితి, వాతావరణానికి తగ్గట్లుగా వచ్చే



ఎక్కడ ఎంత?

మందు	వ్యాధి	ఎంఆర్‌పి ధర	సంజీవని ధర
గ్లిమీ ఫ్రైడ్ 1ఎంజి	(సుగర్)	5.00 రూ	0.77 పైసలు
మెట్‌ఫార్మిన్ 500 ఎంజి		70 పైసలు	0.52 పైసలు
గ్లిమిఫ్రైడ్‌మెట్ పార్మిన్		4.50 పైసలు	0.97 పైసలు
ఎనలాప్రిల్ 5ఎంజి	(హైపర్‌టెన్షన్)	2.94 పైసలు	0.48 పైసలు
ఎంలోడపిన్ 5ఎంజి		2.25 పైసలు	0.39 పైసలు
రామిప్రిల్ 5 ఎంజి		8.50 పైసలు	1.62 పైసలు
టెల్మిసార్టన్ 40 ఎంజి		7.10 పైసలు	3.89 పైసలు
అట్రర్వాస్టాటిన్ 20ఎంజి	(గుండెవ్యాధులకు)	12.40 పైసలు	3.63 పైసలు
కాల్షియం సిరప్		44.10 పైసలు	28.22 పైసలు
ఎమికాసిన్ సల్ఫేట్ 500 ఎంజి ఇంజక్షన్		58.00 పైసలు	12.35 పైసలు
పెంటాపెరజాల్ 40 ఎంజి వైల్		75.00 పైసలు	23.89 పైసలు

వ్యాధుల నివారణకు సంబంధించిన అన్ని రకాల మందులను మన దేశీయ మందుల కంపెనీలు ఉత్పత్తి చేయడంలో పూర్తిగా సఫలీకృతమయ్యాయి. పైగా నేరుగా కంపెనీలతో సంప్రదించడం వల్ల తక్కువ ధరకు అందుతున్నాయి. మరో ముఖ్యమైన అంశం ఒకటుంది. కంపెనీలు తమ బ్రాండెడ్ మందులను అమ్ముకోడానికి విచ్చలవిడిగా ఖర్చుచేస్తాయి. వీటికి మార్కెటింగ్, ప్రమోషన్, జీతభత్యాలు, వాణిజ్య ప్రకటనలు, ఎక్సైజ్ పన్నులు, ఆకర్షణీయమైన ప్యాకింగ్ ఖర్చులుంటాయి. ప్రమోషన్ కోసం మెడికల్, డాక్టర్ల కాన్ఫరెన్సులు పెడతాయి. జనరిక్ మందులకు ఇటువంటి ఖర్చులేమీ వుండవు. దీనివల్ల రోగిపై మందుల భారం తగ్గుతుంది. భారతదేశంలో పేరెన్నికగన్న 20 ఫార్మా కంపెనీలు బ్రాండెడ్ మందులతోపాటు జనరిక్ మందులు కూడా తయారుచేస్తున్నాయి. జనరిక్ మందులు పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో సాధారణ ధరలతో సమానంగా అమ్మడం జరుగుతోంది.

అబద్ధపు ప్రచారాలు

జనరిక్ మందులనేవి పనిచేయవని, నాణ్యతలేనివని, మోతాదులో మందు ఉండదని, తయారు చేసే విధానంలో తగిన సాంకేతిక నైపుణ్యం లేదని... అందువల్లే చౌకధరలకు విక్రయిస్తున్నారన్న దుష్ప్రచారం సాగుతోంది. పైగా 5రూపాయల ఖరీదుచేసే బిళ్లను 50 పైసలకే ఎలా ఇస్తారు? అంత చవగ్గా ఎలా లభ్యమౌతుంది? 500 ఎంజి టాబ్లెట్‌లో 200 ఎంజి మందే వుంటుందని కూడా ప్రచారం చేసేస్తారు. ప్రయివేటు కంపెనీలు, బ్రాండెడ్ కంపెనీలు లాభార్జన కోసం ... టర్నోవర్ పెంచుకోవడంకోసం ఎంతకైనా తెగిస్తాయనడానికి ఉదాహరణ ఈ దుష్ప్రచారం. నిజానికి పెద్దపెద్ద శాస్త్రవేత్తలు, శాస్త్రజ్ఞులు, మందు పని చేయడంలో జనరిక్‌కు, బ్రాండెడ్‌కు ఏ మాత్రం తేడా లేదని పరిశీలించి నిరూపించారు. గీతం ఫార్మసీ కాలేజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ విష్ణు లేబరేటరీలో జనరిక్ మందులు, బ్రాండెడ్ మందుల నాణ్యతను పరిశీలించారు. దీంట్లో కొన్ని బ్రాండెడ్ మందుల కంటే జనరిక్ మందులే ఒక మోతాదు నాణ్యత ఎక్కువగా ఉన్నట్లు నిర్ధారించారు. అందువల్ల ప్రజల్లో అవగాహన పెంపొందించి, వారి అనుమానాలను నివృత్తి చేసినప్పుడు ఈ పథకాలకు సరైన ఆదరణ లభిస్తుంది. ప్రయివేటు మందుల కంపెనీలు చేసే దుష్ప్రచారం నుంచి బయటపడగలరు.

కొత్త సవాళ్లు

ప్రపంచంలో అత్యంత లాభసాటి వ్యాపారాలు రెండే రెండు. ఒకటి ఆయుధ వ్యాపారం. రెండోది ఔషధ వ్యాపారం. ఒకటి ప్రాణాలు తీస్తే మరోటి ప్రాణాలు పోస్తుంది. అయితే వ్యాపార ధోరణి, లాభార్జన మూలంగా ప్రాణాలు పోయాల్సిన మందుల ధరలు అందుబాటులో లేకుండా పోయే పరిస్థితి దాపురించింది. తిలా పాపం తలా పిడికెడు అన్న చందాన ఆ పాపంలో ఫార్మా కంపెనీ యజమానులతోపాటు ప్రభుత్వ పాత్రా వుంది. స్వావలంబన సాధించిన మందుల పరిశ్రమలో బహుళజాతి కంపెనీల ప్రవేశానికి యుపిఎ 2 ప్రభుత్వం అనేక రాయితీలు ఇచ్చింది. వెసులుబాట్లు కల్పించింది. స్వేచ్ఛా, వాణిజ్య ఒప్పందాలు చేసుకొంది. ఐరోపా, అమెరికా దేశాల కంపెనీల ప్రవేశంతో ఈ మందులు చౌకధరలకు లభ్యమయ్యే పరిస్థితి కష్టతరమవుతుంది. దానికి ప్రధాన కారణం మందుల పరిశ్రమపై గుత్తాధిపత్యం, ధరల నియంత్రణలో ప్రభుత్వ వైఫల్యం. పైగా పేటెంట్ హక్కులు పొందినటువంటి బహుళజాతి కంపెనీలు ఇంత చౌకగా ప్రజలకు మందులు ఇవ్వడానికి ఎట్టి పరిస్థితుల్లో అంగీకరించవు. ఒకవైపు పబ్లిక్ రంగ సంస్థలైనటువంటి ఐడిపిఎల్, హెచ్ఎఎల్, బెంగాల్ కెమికల్స్, బెంగాల్ ఇమ్యూనిటీ, స్మిత్ స్టాండ్ స్ట్రీస్ మందుల కంపెనీలు ప్రభుత్వ విధానం వల్ల నిర్వీర్యమయ్యాయి. బహుళజాతి సంస్థలకు పెద్దపీట వేయడం వల్ల ఈ కంపెనీలు మూతపడే స్థితికి ప్రభుత్వమే నెట్టింది. ఐడిపిఎల్‌కు ఇచ్చిన ప్యాకేజీ ఇంతవరకూ అమలుకు నోచుకోలేదు. ప్రస్తుతం కేంద్రప్రభుత్వం అనుసరిస్తున్న విధానం వల్ల విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు వచ్చిపడుతున్నాయి. అమితమైన లాభాలు ఆర్జించడానికి మందుల కంపెనీలను కొనుగోలు చేస్తున్నాయి. మార్కెటింగ్ హక్కులను, బ్రాండెడ్‌లను సొంతం చేసుకుంటున్నాయి. పర్యవసానంగా చౌకధరలకు లభ్యమయ్యే జనరిక్ మందుల పరిస్థితి ప్రశ్నార్థకం కాబోతోంది.

మందుల కంపెనీలను బట్టి మార్జిన్ వచ్చే అవకాశం వుంది. జనరిక్ మందులకు సంబంధించి డాక్టర్లు ఎక్కువ మంది సిఫార్సు చేయరు. కారణం! ఈ మందుల ధర తక్కువ ఉండటంతో డాక్టర్లకు మార్జిన్ వచ్చే అవకాశం ఉండదు. కొందరు వైద్యులు తమ మార్జిన్ల కోసం ఇతర కంపెనీలకు సంబంధించిన మందులను మాత్రమే రాస్తారు. కొందరు ప్రభుత్వాసుపత్రి వైద్యులు సైతం ఇతర కంపెనీల మందులనే రాస్తుంటారు. కారణం వారికి పెద్ద మొత్తంలో మందుల కంపెనీల నుండి మార్జిన్ రావడమే. అయితే పేద, మధ్య తరగతి ప్రజలను దృష్టిలో ఉంచుకుని వైద్యులందరూ సేవా దృక్పథంతో జనరిక్ మందులను సిఫార్సు చేస్తే రోగులకు తక్కువ ఖర్చు అయ్యే అవకాశం ఉంది. పైగా వీటి గురించి ప్రభుత్వాలు ప్రచారం చేయాల్సిన, చైతన్యం కలిగించాల్సిన, అన్ని ప్రాంతాలకూ విస్తరించాల్సిన ఆవశ్యకత ఎంతైనా వుంది. అప్పుడైనా వైద్యం అందని ద్రాక్షగా మారిన ఈ రోజుల్లో సామాన్యులకు కూసింత వెసులుబాటు కలుగుతుంది.

-ప్రజాశక్తి యంత్రాంగం

తెలుసా!

సబ్బు సుబ్బి

చూశారుగా. ఆ పందొమ్మిదేళ్ల అమ్మణ్ణి. సబ్బులను, సర్ఫు పౌడిని ఎలా లాగించేస్తోందో! అదేంటో ఆమెకు సబ్బు వాసన చూస్తే చాలు నోరూరిపోతుంది. తినేయాలనిపిస్తుంది. సర్ఫు పౌడర్ చూస్తే చాలు చప్పరించేయాలనిపిస్తుంది. ఇంక వాటిని చూశాక ఆమె ధ్యాసంతా వాటిమీదే వుంటుంది. ఎప్పుడెప్పుడు వాటిని లాగించేద్దామా అనే ఆలోచిస్తుంది. ఇంతకీ సబ్బు సుబ్బి ఎవరా! అనుకుంటున్నారా! టెంపెస్ట్ హెండర్సన్. ఫ్లోరిడా వాసి. హెండర్సన్ ఎప్పటినుంచి సబ్బులు లాగించేస్తోందో? ఇప్పటికి ఎన్ని ఊదేసిందో? అనడిగితే మాత్రం చెప్పడం కూసింత కష్టమే. తన చిన్నప్పుడు అమ్మ బట్టలుతికే సబ్బు వాసన తెగ నచ్చేసేది. మంచం మీద అమ్మ వేసిన ఉతికిన దుప్పటి వాసనంటే మహా ఇష్టంగా వుండేది. అదే మెల్లగా చప్పరించేసే దాకా వచ్చేసింది. ఏకంగా వారానికి ఐదు సబ్బులు తినేస్తుంది. ఇవి కాక సర్ఫ్ పౌడర్‌ను పంచదార మాదిరిగా నాలుకమీద వేసుకుని చప్పరిస్తుంది. తల్లిదండ్రులకు దూరంగా కాలేజీలో చదువుకోవాల్సి రావడం కూడా ఆమెలో ఓ విధమైన ఒత్తిడికి, ఒంటరితనానికి కారణమైంది. దాని నుంచి బయటపడడానికి సబ్బులు తినడం మొదలెట్టింది హెండర్సన్. వుండేకొద్దీ వాటిని తినకుండా వుండలేని స్థితికి వచ్చేసింది. అప్పుడు తప్పనిసరి పరిస్థితుల్లో వైద్యులను ఆశ్రయించింది. తన సబ్బు గాథంతా విన్న వైద్యులు ఆమెకు 'పికా' అనే అరుదైన వ్యాధి వుందని తేల్చారు. ఇప్పుడు దానికి విరుగుడుగా చికిత్స పొందుతోంది. మనం కూడా చూస్తుంటాం కదా! కొందరు గర్భిణీలు బొగ్గు, బియ్యం, చాక్పీసు, మట్టి తింటుంటారు. పిల్లలు చాక్పీసులు, రాళ్లు, మట్టి లాగించేస్తుంటారు. శరీరంలో కొన్నిరకాల ఖనిజలవణాల లోపం వల్ల ఇలా జరుగుతుంటుంది. ఇప్పుడు మనం చెప్పుకున్న హెండర్సన్ కూడా అదే రీతిలో సబ్బులు లాగించేస్తోందన్నమాట.

కార్టూన్ తరహాలో...

జీవితంలో ఒక్కసారి మాత్రమే వచ్చే పెళ్లిని ఘనంగా చేసుకోవాలని కొందరు, చిత్రవిచిత్ర పద్ధతుల్లో చేసుకోవాలని మరికొందరు, ఆర్భాటం లేకుండా ఆదర్శంగా చేసుకోవాలని ఇంకొందరు భావిస్తారు. ఆచరిస్తారు. ఇందులో ఒక తరహా వివాహం గురించి ఇప్పుడు చెప్పుకుందాం. చూశారుగా ఫొటో. కార్టూన్ పాత్రల మాదిరి బట్టలు వేసుకొని పెళ్లిచేసుకుంది ఓ జంట. ఈ వింత బ్రిటన్‌లో జరిగిందిలెండి. పెళ్లికుమారుడు రాబ్ టవెర్నర్. పెళ్లికుమార్తె నిసా పాటెన్. టవెర్నర్‌కు కార్టూన్ పాత్రల మాదిరి ఫ్యాన్సీ డ్రస్ వేసుకొని వివాహం చేసుకోవాలనిపించింది. అబ్బాయి చేసిన సూచనను అమ్మాయి సంతోషంగా అంగీకరించింది. వెంటనే ఇద్దరూ కలిసి షాపింగ్ చేసి నీలిరంగు సూపర్ మ్యాన్ డ్రస్సు, ఎరుపు రంగు జెస్సికా రాబిట్ డ్రస్సు ఎంపిక చేసుకున్నారు. తమాషా ఏమంటే పెళ్లికి హాజరైన అతిథులు కూడా రకరకాల కామిక్ పాత్రల మాదిరి డ్రస్సులు వేసుకుని వచ్చారు. మొత్తంమీద చూస్తే వారి వివాహమహోత్సవ సమయాన పెద్ద కామిక్ సెట్టింగ్‌ను చూసిన అనుభూతి కలిగింది. హల్క్, బెట్టీ బూస్, ట్వీటీ పై, క్యాట్ ఉమన్, రోగర్ ర్యాబిట్, స్కూబీడూ డ్రస్సులు వేసుకున్నవారు కనిపించారా సమయాన. మరో విశేషమేమంటే నూతన వధూవరులిద్దరికీ కార్టూన్లన్నా, కామిక్కులన్నా ప్రాణమట. అందుకే ఈ పద్ధతిలో పెళ్లి చేసుకున్నారు. అతిథుల్లో కూడా కూసింత హాస్యరసం ఎక్కువే వున్నట్టుంది. అందుకే అంతా సంతోషంగా పెళ్లి వేడుకల్లో పాల్గొన్నారు.



పుట్టుకతోనే పళ్లుంటే...

ఈ లండన్ బుడతడి పేరు ఒరావర్ జేమ్స్. అమ్మ బొజ్జలోంచి ఒక ప్రత్యేకతతో భూమిమీదకొచ్చాడు. చూశారుగా. వాడికి రెండు కింది పళ్లు వున్నాయి. ఇహ చూస్కోండి! ఈ విషయం తెలిసిన వారంతా పిల్లాడిని చూడ్డానికి తెగ ఉత్సుకత చూపించారట. చుట్టాలు, బంధువులు, స్నేహితులు అనేం లేదు! విషయం తెలిసిన వారంతా వచ్చేశారు. దాంతో ఆసుపత్రి తిరునాళ్ల మాదిరి తయారైంది. మొత్తంమీద తమ హాస్పిటల్ పేరును అందరినోటా వినిపించిన చిన్నారిని చూసి వైద్యులు, ఉద్యోగులు తెగ మురిసిపోయారు. తల్లిదండ్రులకు కూడా సంతోషంగానే వుందికానీ...ఏదో తెలీని భయం మాత్రం వారి మనసుల్లో వుంది. సాధారణంగా పిల్లలకు ఆరు నెలల వయసు వచ్చిన తర్వాత ఏడాదిలోపు తొలి పన్ను బయటికి వస్తుంది. తర్వాత పాల పళ్లు ఊడి శాశ్వత దంతాలు వస్తాయి. మరి జేమ్స్‌కి పుట్టుకతోటే వచ్చిన పళ్లు ఊడతాయా! శాశ్వతంగా వుండిపోతాయా! అనేది సందేహంగానే వుంది.

ఈ ప్రశ్నకు బదులేది?

- వై. నాగలక్ష్మి

గాజులమ్మో గాజులు... గాజులు.... అని అరుపు వినిపించింది. అంతే ఆ వీధిలో ఉన్న అమ్మాయిలు అందరూ వచ్చి బండి చుట్టూ గుమిగూడారు. ఆ వీధిలో అమ్మాయిలందరూ కాలేజీకి వెళ్లేవారే. కుసుమ కూడా ఆతృతగా "అమ్మా గాజులబ్బాయి వచ్చాడే. రావే వెళ్దాం" అని పిలిచింది. కుసుమకు పదిహేనేళ్ళు. పదవ తరగతి చదువుతుంది. మట్టి గాజులంటే ప్రాణం. వాటిల్లో ఆమె తొడగని రంగు గాజులంటూ లేవు. చిన్నప్పటి నుండి వేసుకున్న గాజులన్నీ భద్రంగా ఒక పెట్టెలో దాచింది. ఆ పెట్టెను చూసిన వాళ్లందరూ 'ఏం చేస్తావే అన్ని గాజులు?' అని అనేవాళ్ళు. కుసుమ చాలా అందమైన పిల్ల. లంగా ఓణీ వేసుకుని చేతి నిండా గాజులు తొడుక్కుని బంగారపు బొమ్మలా ఉంటుంది. ఆమె అంటే స్నేహితులకే కాదు ఆ వీధిలో వాళ్లందరిక్కూడా ఇష్టం. ఎందుకంటే కుసుమ అణకువగా, పద్ధతిగా నడుచుకుంటుంది. అంతే చలాకీగా పనులు చక్కబెడుతుంది. ఆదివారం వచ్చిందంటే చాలు ఆ వీధిలో ఆడపిల్లలందరూ ఉదయాన్నే అన్నం బాక్సులు తీసుకుని పొలాల గట్లమీదకి వెళ్లేవాళ్లు. అక్కడంతా సరదాగా ఆడుకుని ఏ సాయంత్రమో, చీకటి పడేసమయానికో ఇల్లు చేరేవారు. అ వీధిలో వారందరివీ మధ్య తరగతి కుటుంబాలే. అయినా వారందరూ చాలా ఆత్మీయంగా, అన్యోన్యంగా కలిసి ఉండేవారు.

ఒకరోజు కుసుమ పెదనాన్న వచ్చారు. కుసుమ అమ్మగారు జానకి వంటగదిలో నుంచే "కుసుమా ఏం చేస్తున్నావు. పెదనాన్నగారు వచ్చారు. మంచినీళ్లు ఇవ్వమ్మా" అంది.

సరే అమ్మా అంటూ కుసుమ నీళ్లు ఇచ్చి పెదనాన్నకు కావాల్సిన ఏర్పాట్లు చేసింది.

"కుసుమా... బాగా చదువుకుంటున్నావామ్మా?" అని అడిగారు.

"పరీక్షలు దగ్గరకొస్తున్నాయి కదా. బాగా చదువుతున్నాను పెదనాన్నా" అంది.

"ఏమ్మా నాన్న వచ్చే సరికి బాగా చీకటి పడుతుందా?" అని అడిగారు.

వంటగది నుండి చేతులు తుడుచుకుంటూ బయటికి వస్తున్న జానకి "అవును బావగారు. ఆయన వచ్చేసరికి లేటవుతుంది. మీరు ఇదేనా రావడం? అక్కడ అందరూ కులాసానే కదా?" అని యోగక్షేమాలు అడిగింది. కబుర్లు చెప్పుకుంటుండగానే జానకి భర్త గోపాలం వచ్చాడు.

"ఎంత సేపయింది అన్నయ్యా వచ్చి? ఊళ్లో అందరూ బాగున్నారుగా?" అడిగాడు గోపాలం.

"ఆ... ఆ... మేం అందరం బాగున్నాం. కానీ ఇక్కడ పంటలు ఎలా వున్నాయి? పెట్టుబడికి తగ్గ రాబడి వస్తుందా? లేదా?" అడిగారు.

"పోయినేడాది కంటే ఈ ఏడాది పర్వాలేదన్నయ్యా" అన్నాడు.

ఈలోగా జానకి భోజనం సిద్ధం చేసి కుసుమని కూడా పిలిచింది.

"నేను తర్వాత తింటానమ్మా. మీరు తినేయండి" అని గదిలోనుండే సమాధానం ఇచ్చింది.

రెండు రోజులుండి కుసుమ పెదనాన్న వెళ్లిపోయారు. ఆయన ఏదో సంబంధం గురించి మాట్లాడుతున్నారు. కానీ కుసుమ అవేమీ పట్టించుకోలేదు.

◆◆◆

పోస్ట్ మేన్ కేక విని వెళ్లి కవర్ తీసుకుంది కుసుమ.

"ఎవరి దగ్గర్నుండమ్మా ఈ లెటర్?" అంది జానకి.

"పెళ్లి కొడుకు ఫోటోలమ్మా. పెదనాన్న పంపించారు" అంది.

'కుసుమకు కాబోయే భర్త ఫోటో' అని ఆ వీధిలోని వారందరూ చూశారు. "కుసుమ చాలా అదృష్టవంతురాలు" అని పొగిడారు.

అనుకున్న విధంగా వెంటవెంటనే నిశ్చితార్థం, పెళ్లి జరిగాయి. అత్తగారింటికి వెళ్లే సమయం వచ్చింది. పెళ్లి తర్వాత చీరలో ఉన్న కూతుర్ని చూసిన జానకి "అప్పుడే నా కూతురికి పెద్దరికం వచ్చేసింది" అనుకుంది. ఉన్నంతలో ఏ లోటూ లేకుండా అత్తగారింటికి సాగనంపింది.

అత్తగారింట్లో కొత్త జీవితం మొదలు పెట్టింది. ఆమె భర్త రఘు కుసుమకు ఏ కష్టం కలగకుండా చూసుకుంటున్నాడు. ఇంటిపనిలో, వంటపనిలో సాయం చేస్తాడు. సినిమాలకి, షికార్లకి తీసుకెళ్తాడు. కుసుమను అసలు కష్టపెట్టడు. చూస్తుండగానే నాలుగేళ్ళు గడిచిపోయాయి. ఇప్పుడు వారికి ఓ కొడుకూ, కూతురు. కొడుకు పేరు దీక్షిత్, కూతురు పేరు లిఖిత. దీక్షిత్‌ను స్కూల్లో కూడా చేర్పించారు. రోజులు ఎప్పుడూ ఒకేలా ఉండవు కదా. రఘు ఆఫీసుకెళ్లి వస్తుంటే ఓ రోజు లారీ యాక్సిడెంట్

అయింది. అక్కడికక్కడే చనిపోయాడు. అతని పర్సులోని అడ్రస్‌ని బట్టి అక్కడున్న వాళ్లు ఇంటికి సమాచారం అందించారు. ఈ విషయం విన్న కుసుమకు ఏం చేయాలో పాలుపోలేదు. అలాగే కూలబడిపోయింది. విషయం తెలుసుకున్న చుట్టుపక్కల వారు మార్చురీకి వెళ్లి శవాన్ని తెచ్చారు. వారే కుసుమ తల్లిదండ్రులకు, అత్తమామలకు కబురు చేశారు. అత్తగారి తరుపు బంధువులందరూ వచ్చి అంత్యక్రియలు జరిపించి ఎవరిదారిన వాళ్లు వెళ్లారు. అప్పటి వరకు కుటుంబానికి సంబంధించిన అన్ని వ్యవహారాలు రఘునే చూసుకున్నాడు. ఇప్పుడు అతను లేడు. వాళ్ల కంటూ ఆస్తి కూడా లేదు. కుసుమకు ఏం చేయాలో దిక్కుతోచలేదు.

తల్లిదండ్రులు కొన్ని రోజులు కుసుమకు తోడుగా అక్కడే ఉన్నారు. కానీ ఉన్న ఊరిని వదిలి వారు మాత్రం అక్కడ ఎంత కాలం ఉంటారు. నాలుగు నెలల తర్వాత కూతుర్ని తీసుకుని తమ ఊరికి వెళ్లారు. కుసుమ సర్వస్వం కోల్పోయిన దానిలా ఎప్పుడూ ఏడుస్తూ కూర్చునేది. కూతుర్ని ఆ స్థితిలో చూసి ఆమె తండ్రి మంచం పట్టాడు. పుట్టింటి ఆర్థిక పరిస్థితి కూడా అంతంత మాత్రమే. ప్రస్తుతం తల్లి కష్టంతోనే కుటుంబం గడవాలి. ఇదంతా చూసి బాధపడ్తున్న కుసుమకు "ప్రతి ఒక్కరికి కష్టాలు వస్తాయి. వాటికి భయపడకూడదు" అని తల్లి ఓదార్చేది.

తల్లికి భారం కాకూడదని ఆలోచించి ఓ నిర్ణయానికొచ్చింది. తనూ ఏదో పని చేయాలనుకుంది. ఏది ఏమైనా తను ఆత్మస్థైర్యంతో నిలబడాలి, తన పిల్లల్ని పెంచి ప్రయోజకుల్ని చేయాలనుకుంది. తన ఆత్మ విశ్వాసమే తన ఆస్తి, అంతకుమించి ఏం కావాలనుకుంది. పుట్టింటి నుండి బయటికి వచ్చేసింది. తన కాళ్లమీద తను నిలబడాలని నిశ్చయించుకుంది. ఉద్యోగం కోసం ప్రయత్నించింది. ఎక్కడా దొరకలేదు. "పదవ తరగతి చదివాను, ఏ చిన్న ఉద్యోగం ఇచ్చినా చేస్తాను. ఎంత జీతం ఇచ్చినా తీసుకుంటాను" అని ఎన్నో ఆఫీసుల చుట్టూ తిరిగింది. వెళ్లిన ప్రతి చోటా లేదన్న సమాధానమే ఎదురయింది. దగ్గరున్న డబ్బులు అయిపోయాయి. పిల్లలకు తిండానికి కూడా వెతుక్కోవాల్సిన పరిస్థితి ఎదురయింది. ఏ పనీలేకపోతే జీవనం కష్టమని ఓ పెద్ద ఆఫీసర్ ఇంట్లో పనికి కుదిరింది. పిల్లల్ని దగ్గర్లోని గవర్నమెంటు స్కూల్లో చేర్పించింది. రోజులు గడుస్తున్నాయి. ఓ రోజు ఆ యింటి యజమానురాలు కుసుమ కోసం కబురు పెట్టింది. కుసుమ వెళ్లే సరికి ఆమె సామానంతా ప్యాక్ చేయిస్తుంది.

"ఏంటమ్మగారూ... సమాన్లన్నీ సర్దిస్తున్నారు" అంది.

"సార్‌కు ట్రాన్స్‌ఫర్ అయింది. మేం వేరే ఊరికి వెళ్తున్నాం" అంటూ కొంత డబ్బు చేతిలో పెట్టింది. కుసుమకు మళ్లీ నిరాశే ఎదురయింది. ఉన్న ఆధారం పోయింది. మళ్లీ పని వెతుక్కోవాలి అని దిగాలుగా కూర్చుని ఉంది. పిల్లలిద్దరూ పక్కన కూర్చుని ఆమెనే చూస్తున్నారు. ఆమె కష్టపడుతుందని వారికీ తెలుస్తోంది. కానీ ఏం చేయాలో అర్థం కావట్లేదు.

పిల్లలిద్దరూ ఆడుకుంటుండగా ఓ గువ్వ పిట్ట చెత్తను పట్టుకొచ్చి అక్కడున్న పూల చెట్టుమీద గూడు కడుతోంది. అది చూసి పిల్లలు తల్లిని పిలిచారు. "అమ్మా... ఆ పిట్ట చూడు. మన చెట్టుమీద పుల్లలు, చెత్తంతా పెడుతోంది. మన చెట్టు విరిగి పాడైపోతుంది కదమ్మా. పూలన్నీ రాలిపోతాయి కదా" అంటున్నారు. ఆ దృశ్యాన్ని చూసిన కుసుమకు తన సమస్యకు సమాధానం దొరికిందనిపించింది. వెంటనే ఓ బుట్ట తీసుకొచ్చి ఆ పూలన్నీ కోసి మాల కట్టింది. కానీ ఆ పూమాలల్ని అమ్మేదెలాగో తెలియడం లేదు. తను రోజూ వెళ్లే దారిలో పూలమ్మే కొట్టు గుర్తొచ్చింది. వెంటనే అక్కడకి వెళ్లి తన సమస్యను చెప్పింది. "రోజూ పూల మాలల్ని తెస్తాను, అమ్మి పెట్టగలరా" అని అడిగింది. మూరకింతని ఒప్పందం కుదుర్చుకుంది. ఇక రోజూ ఆమెకు అదే పని. ఈ వ్యాపారం బాగానే ఉందనిపించింది. ఇంట్లో వున్నవి చాలవని మరి కొన్ని పూల మొక్కల్ని పెంచింది. అవే కాకుండా రంగు రంగుల ప్లాస్టిక్ పేపర్లు తెచ్చి వాటితో అందంగా డెకరేటివ్ అయిటమ్స్ తయారు చేసి ఇంటిదగ్గర, షాపుల్లో అమ్మేది. ఇలా తనకొచ్చిన చేతి పనినే తన జీవన మార్గంగా ఎన్నుకుంది. ఇప్పుడు కుసుమ ఆదాయం బాగానే ఉంది. పిల్లల్ని మంచి స్కూల్లో చేర్పించింది. తనకు తోడుగా మరో ఇద్దర్ని పెట్టుకుని వారికీ ఆధారంగా ఉంటోంది. ★





మాటే మంత్రము



మనం పోటీ ప్రపంచంలో నివసిస్తున్నాం. మనకి మనం వీలయినంత మెరుగ్గా సమాజంలో కన్పించాలి. మన గొంతు మన వ్యక్తిత్వాన్ని, మన ఆలోచనలను ప్రతిధ్వనిస్తుంది. మన మాటలు, కంఠస్వరం ద్వారా ఇతరుల పట్ల మన భావాలు, మన తెలివి, ఉదారత వంటివి తెలియజేయగల్గుతాం.

చక్కని వస్త్రాలంకరణ చేసుకుని తగిన విధంగా మాటలు, కంఠస్వరం విషయంలో జాగ్రత్తలు తీసుకోకపోతే మన వ్యక్తిత్వం దెబ్బ తింటుంది. మాటల ద్వారా ఇతరులలో మన వ్యక్తిత్వపు విలువలు స్థిరపడతాయి. మాటల శైలిని బట్టి మన చదువు, సంస్కారాలను ఇతరులు అంచనా వేస్తారు.

- సి.వి. సర్వేశ్వరశర్మ
ఫోన్ నెం: 9866843982
sarma.chavali@gmail.com

సాధారణంగా కంఠస్వరం, మాటల ధోరణిపై అంతగా దృష్టి పెట్టరు. ఎందుకంటే ఎవరికి వారు వారి ధ్వనిని వినలేరు. మనిషి తన అందచందాలను బేరీజు వేసుకునేందుకు అద్దం ముందు నుంచుని ఎన్నో సార్లు చూసుకుంటాడు. కానీ తన కంఠస్వరం గురించి ఇటువంటి అప్రమత్తతతో ఉండరు. అందుకే ఎవరికి వారే తమ కంఠస్వరాన్ని, మాటల తీరును టేపురికార్డులో రికార్డు చేసుకుని వినడం మంచిది.

ఇది సాధ్యం కాకపోతే చెవుల వెనుక భాగాలు మూసి ముందు భాగాలు తెరిచి వుంచితే మీ మాటలు, కంఠస్వరం మీకు వినబడుతుంది. తేడాలు, అపస్వరాలు ఎవరికి వారే గుర్తించుకోగల్గుతారు.

శబ్దం, స్వరం ముఖ్యం

మీ ఆలోచనలు ఎంత శ్రేష్ఠమైనవి అయినా వాటిని ఆహ్లాదకరమైన స్వరంతో చెప్పలేకపోతే వినేవారు వాటిని ఆమోదించలేరు. ఎక్కువమంది ప్రతిభావంతంగా ఉండలేకపోవడానికి కారణం వారి కంఠస్వరం ఇతరుల దృష్టిని ఆకర్షించలేకపోవడమే.

వ్యక్తిత్వం కంఠస్వరం పరంగా అంచనాలు వేయడం జరుగుతూ ఉంటుంది. కంఠస్వరం తక్కువ స్థాయిలో, నిశ్చితమైన రీతిలో ఆకర్షణీయమైన మాడ్యులేషన్‌తో ఉండాలి. అటువంటి కంఠస్వరం సులువుగా పనులను సాధించుకోగల్గుతుంది. కంఠస్వరాలు ఎలా ఉంటాయో ఒకసారి తెలుసుకుందాం.

రకరకాలుగా స్వరాలు

కొంతమంది కంఠస్వరం కీచుగా ఉంటుంది. అద్దం ముందు ఉండి మాట్లాడుతుంటే కంఠంలోని స్వరపేటికలు లేదా గొంతు చుట్టూ ఉండే నరాలు ఉబ్బుతూ కనిపిస్తే మీ కంఠస్వరం చాలా ఎక్కువ పిచ్‌తో ఉన్నట్లు అర్థం.

కొందరు ముక్కుతో మాట్లాడినట్లు మాట్లాడుతారు. ముక్కును బొటనవేలు, చూపుడు వేలుతో నొక్కి మాట్లాడితే ముక్కులో ఝుంకార ధ్వని వస్తుంటే మీరు ముక్కుతో మాట్లాడినట్లు మాట్లాడుతున్నారని గ్రహించాలి.

మీరు మాట్లాడినప్పుడు గుసగుసలాడినట్లు ఉన్నట్లయితే ఆ విషయం మీకు తెలియక పోవచ్చు. మీ వేలును స్వరపేటిక పై వుంచి ఏదైనా మాటను బిగ్గరగా మాట్లాడండి. గుసగుస ధ్వని మీరు గుర్తించినట్లయితే మీ కంఠస్వరం ఆ విధంగా ఉంటోందని తెలుసుకోవాలి.

మీకు తెలియకుండా మీ భాషలో మీప్రాంతపు మాండలీకం లేదా యాస ధ్వనించవచ్చు. మీకు అది సహజంగా అన్పించవచ్చు. కాని వినేవారికి హేళనచేసే విధంగా వినిపిస్తుంది. ఇటువంటి యాసల నుండి తగిన కృషి చేసి బయటపడాలి. వాటి వాడకం తగ్గించే నిరంతర ప్రయత్నం మీకు సత్ఫలితాలు ఇస్తాయి.

మాటల ప్రయోగం - జాగ్రత్తలు

మీరు ఉపయోగించే మాటల విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. ఇతరులకు మీరు చెప్పే విషయం మనసులో ముద్రించుకోవాలంటే సరిపైన మాటలు ప్రయోగించాలి గాని మీకే అర్థం తెలియని కఠినమైన మాటలు ఉపయోగించకూడదు.

'జాగ్రత్త', 'మళ్లీ చెప్పనా?', 'నేనంటే ఏమిటనుకుంటున్నారు?' వంటి మాటలు తరచూ వాడడం వల్ల అవి అర్థరహితంగా మారతాయి. ఎంతో అవసరమైన సందర్భాల్లో మాత్రమే భావగర్భితమైన మాటలు ఉయోగించాలి.

వాడిన మాటలు తిరిగి తిరిగి వాడే వారిని కూడా మనం చూస్తూ ఉంటాం. 'వాట్ ఐ మీన్' అని తరచూ అంటూ ఉంటారు. 'అఫ్‌కోర్స్', 'యు నో' ఈ రకంగా మాట్లాడేవారికి భావప్రకటన కొరవడినట్లు గమనించాలి. వాడిన మాట వాడకూడదని దృష్టిలో ఉంచుకోవాలి. ఇటువంటి వారు పదసంపదను పెంచుకోవాలి. ఉదాహరణకు 'అందం' అనే మాట అస్తమానం వాడడం కన్నా 'మనోహరం', 'చూడముచ్చట', 'సొగసైన', 'రమణీయమైన', 'ఇంపైన', 'సుందరమైన', 'దివ్యమైన' వంటి పదాలను ఉపయోగించి చెప్పవచ్చు.

నిర్లక్ష్యంగా, తప్పుగా మాటలు పలుకుతూ చెబితే ఇతర విషయాల్లో కూడా మీరు నిర్లక్ష్యంగా ఉంటారని అర్థం చేసుకుంటారు. మీరు పలికే మాట తీరుపై దృష్టి నిలిపి మీరు చెప్పదలచుకున్నది స్పష్టంగా చెప్పగల్గడం అలవరచుకోవాలి.

వ్యాకరణ దోషాలు కూడదు

ఉపయోగించే భాషలో వ్యాకరణ దోషాలు ఉండకూడదు. మంచి వ్యాకరణ పుస్తకం అధ్యయనం చేసి వ్యాకరణ దోషరహితంగా మాట్లాడడం అలవరచుకోవాలి. నత్తి వుంటే వైద్య సలహా మేర ఆ సమస్య నుండి బయటపడే మార్గాలు అన్వేషించుకోవాలి.

చక్కని కంఠస్వరంతో ఆమోదిత మాడ్యులేషన్‌తో స్పష్టంగా తక్కువ స్థాయిలో మాట్లాడడం అలవరచుకోవాలి. మన భావజాలాన్ని మంచిగా ఇతరులకు తెలియజేయడానికి తక్కువ స్థాయి అనుకూలమైనది. హెచ్చు స్థాయిలో మాట్లాడడం వల్ల మనిషి వ్యక్తిత్వం విలువ తగ్గిపోతుంది.

చక్కని కంఠస్వరం కోసం...

మెడ, దౌడలు, నాలుక, గొంతు వంటి భాగాలు ఎటువంటి ఒత్తిడికి లోనయినా కీచుగొంతుగా మాటలు వస్తాయి. ఈ ప్రాంతాల్లో ఆవలింతలు వంటి వ్యాయామం వల్ల ఒత్తిడి తగ్గుతుంది. లేదా టేబుల్‌పై మీ చెయ్యి ఉంచి దానిమీద మీ గెడ్డం భాగం ఆనించి 'యా' అనే పదం ఎక్కువసార్లు మాట్లాడుతుంటే ఈ ఒత్తిడి తగ్గుతుంది.

తక్కువ స్థాయిలో మాట్లాడే అలవాటు పోయేందుకు నోరు బాగా తెరిచి పెదాలు కదుపుతూ మాట్లాడడం అలవరచుకోవాలి. 'డబ్ల్యూ' పదంతో మొదలయ్యే మాటలను ఈ విధంగా ప్రాక్టీసు చేయడం మంచిది.

మీ మాటలకు శ్వాస ఆసరాగా ఉండకపోతే మీ మాటలు గుసగుసగా విన్పిస్తాయి.

తప్పుడు చోట్ల మీ వాక్యాలను విరిచి మాట్లాడకూడదు. తెలియని వయసులో పసిపిల్లలు అలా మాట్లాడుతూ ఉంటారు. మీ మాటలను ఇలాంటి పరిస్థితుల్లో ఇతరులు పట్టించుకోరు. శ్వాస వ్యాయామం చేయాలి. దీనివల్ల మీరు మాట్లాడేటప్పుడు మీ శ్వాసమీద మీకు అదుపు ఉంటుంది.

★

మార్ఫింగ్ మేనియా



సాంకేతిక విజ్ఞానం అందుబాటులోకి వచ్చిన తర్వాత అనేక రంగాల్లో దాన్ని ఉపయోగిస్తున్నారు. మీడియాలోనూ దాని వేగం విస్తృతంగానే వుంది. మీడియాలో ఉపయోగించే ఒక ప్రక్రియ 'మార్ఫింగ్'. మరి మార్ఫింగ్ అంటే ఏంటి? మార్ఫింగ్ అనే నాణేనికి వున్న రెండు కోణాలు ఏంటి? ఈ వారం ఈ పేజీలో చూద్దాం.

మార్ఫింగ్ అంటే 'ఏదైనా ఒక ఇమేజ్‌ను ఒక రూపం నుండి మరో రూపంలో మార్పు చెందడాన్ని మార్ఫింగ్ అంటారు. గతంలో ఒక టీవీ యాడ్ వచ్చేది. ఒక చిరుత వేగంగా పరుగెడుతూ మోటర్ సైకిల్‌గా మారిపోయేది. ఈ మధ్య కాలంలో ఇదే తరహా ప్రకటనలు అనేకం టీవీల్లో దర్శనమిస్తున్నాయి. ఇవన్నీ యానిమేషన్ ప్రక్రియలో ఒక భాగం.

ఈ మధ్య కాలంలో ఎలక్ట్రానిక్ మీడియా బాగా వృద్ధి చెందింది. ప్రేక్షకులను ఆకట్టుకునేందుకు ఇటువంటి జిమ్మిక్కులతో రకరకాల ప్రయోగాలు చేస్తున్నారు. దీనికి అవసరమైన వీడియో ఎడిటింగ్ సాఫ్ట్‌వేర్లు అనేకం అందుబాటులో వున్నాయి. వీటి సాయంతో వున్న దాన్ని లేనట్లుగా, లేని దాన్ని వున్నట్లుగా చూపవచ్చు. మధ్య మధ్య "ఏ రకమైన" క్లిప్పింగులనైనా జత చేయవచ్చు. క్లోజప్‌లో ఒక ముఖం చూపించి లాంగ్‌షాట్‌లో మరో దృశ్యం చూపుతుంటారు. ఈ రకమైన ఎడిటింగ్ అంతా వీడియో ఎడిటింగ్ సాఫ్ట్‌వేర్లలోనే చేస్తారు. బాలీవుడ్, టాలీవుడ్‌కి చెందిన ప్రముఖ నటీమణుల నగ్న వీడియోలంటూ ప్రచారంలో వున్నవెన్నో ఈ కోవకు చెందినవే.

మరొకటి ప్రింట్ మీడియా. దీనిలో మార్ఫింగ్‌కు అవకాశం తక్కువ. అయితే ఇక్కడ ఏదైనా ఒక కార్టూన్‌కో, ఫోటోకో మరొకరి తలను అతికించి ప్రత్యేకంగా, వ్యంగ్యంగా చూపడం సర్వ సాధారణం. దీనికి ఫోటోషాప్, కొరల్ డ్రా, ఇల్లస్ట్రేటర్ వంటి సాఫ్ట్‌వేర్లను వాడతారు. ఇంతకుమించి టీవీల్లో చూపినట్లుగా యానిమేషన్ ప్రక్రియను ఇందులో చూపడం సాధ్యం కాదు.

ఇక చివరిది వెబ్ మీడియా. ప్రపంచవ్యాప్తంగా విస్తృత వినియోగంలో వున్న పవర్‌ఫుల్ మీడియా ఇది. పైన చెప్పుకున్న ఎలక్ట్రానిక్ మీడియా, ప్రింట్ మీడియా ప్రక్రియలు ఇందులో కనిపిస్తాయి. యానిమేషన్లు, వీడియోలు, బొమ్మల రూపంలో ఏ ప్రక్రియలోనైనా వెబ్‌సైట్లలోకి వుంచవచ్చు. ఒక్కసారి ఏదైనా వార్తగాని, వీడియోగాని వెబ్‌సైట్‌లోకి ఎక్కితే దాన్ని ప్రచారం చేయడానికి అనేక సాధనాలు ఇంటర్నెట్‌లో అందుబాటులో వున్నాయి. వాటన్నింటినీ ఉపయోగించుకొని నిమిషాల్లో ప్రపంచవ్యాపితం చేయవచ్చు. అది మంచైనా కావచ్చు. చెడైనా కావచ్చు. టెక్నాలజీ అంతగా అభివృద్ధి చెందింది. ఇంటర్నెట్‌లో గ్యాసిప్స్ పాపులర్ అయినంతగా మరే ఇతర అంశమూ పాపులర్ కాదేమో.

ఇటీవల ఈ మార్ఫింగ్ ప్రక్రియ వెబ్‌సైట్లలో దుమారం రేపుతోంది. ప్రముఖుల ఫోటోలను, వీడియోలను మార్ఫింగ్ చేయడం సర్వసాధారణం అయిపోయింది. ముఖ్యంగా సినీతారల విషయంలో ఇంకాస్త 'అతి'గానే వ్యవహరిస్తోంది. తారల నగ్న చిత్రాల మార్ఫింగ్ దగ్గర నుండి ఒక హీరో అభిమానులు మరో హీరోను జుగుప్సాకరంగా చూపుతూ వెబ్‌సైట్లను, బ్లాక్‌లను సృష్టించడం వరకూ వచ్చింది. దీని కోసమే ప్రత్యేకంగా కొన్ని వెబ్‌సైట్లు, బ్లాగ్‌లు వెలుస్తున్నాయంటే ఆశ్చర్యపోవాల్సిన అవసరమే లేదు. హాలీవుడ్ నుండి టాలీవుడ్ వరకు ఆ ఉడ్డు, ఈ ఉడ్డు అనే తేడా లేకుండా ప్రముఖ తారల పాలిట భూతంగా మారింది ఈ మార్ఫింగ్ ప్రక్రియ. వెబ్‌సైట్ల ద్వారా వాటికి బహుళ ప్రచారం లభిస్తోంది. టీవీ చానళ్ల రేటింగ్ కోసం పాకులాడుతున్నట్లుగానే వెబ్‌సైట్లు కూడా ర్యాంకుల కోసం తహతహలాడుతున్నాయి.

ప్రస్తుతం హాట్ టాపిక్ ప్రముఖ సినిమా హీరోలు చిరంజీవి, బాలకృష్ణపై రూపొందించిన 'www.ihatebalayya.com, www.ihatechiru.com' వెబ్‌సైట్లు. అభిమానం వెర్రితలలు వేస్తే ఎలా వుంటుందో చెప్పడానికి ప్రత్యక్ష ఉదాహరణలు ఇవి. ఈ రెండు వెబ్‌సైట్లలోనూ ఆయా హీరోలకు వ్యతిరేకంగా కించపరిచేలా కామెంట్, మార్ఫింగ్ బొమ్మలు, కార్టూన్లు, జోక్స్ వుంటున్నాయి. మరింత బాధాకరం ఏమిటింటే ఆ హీరోల కుటుంబ సభ్యులను కూడా ఈ వెబ్‌సైట్లు వదలడం లేదు. ఈ తరహా రాతలకు స్పందించిన హీరో బాలకృష్ణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. "వెబ్‌సైట్ ఆస్ట్రేలియాలో హోస్ట్ అయ్యింది. దాని కోసం దర్యాప్తు చేస్తున్నాం" అనేది పోలీసువారి సమాధానం. వాస్తవానికి అమెరికా, ఆస్ట్రేలియా వంటి దేశాల్లో ఈ తరహా వెబ్‌సైట్లు హోస్ట్ అవుతుంటాయి. దీనిపై ఆ దేశాల్లో సరైన నియంత్రణ లేదు. ఎక్కడైనా ఒకటీ అరా వున్నా దానిలో అనేక లొసుగులు. దీంతో ఇటువంటి వెబ్‌సైట్లు కుప్పలు తెప్పలుగా పుట్టుకొస్తున్నాయి. వీటి నియంత్రణకు కట్టుదిట్టమైన సైబర్ చట్టాలు లేకపోవడం కూడా కారణం. ఇక బ్లాగులైతే చెప్పనవసరమే లేదు. ఉచితంగా అందుబాటులో వున్న బ్లాగులు, యూ ట్యూబ్‌లలో ఇటువంటి చెత్త రాతలు, మార్ఫింగ్ వీడియోలు, యానిమేషన్లు కోకొల్లలు. వీటికి కూడా ఏరకమైన నియంత్రణ లేదు. బ్లాగ్స్, యూ ట్యూబ్ వంటి వాటిని సదుద్దేశ్యంతో ఏర్పాటు చేసినా కొందరు వాటిని భ్రష్టుపట్టిస్తున్నారు.

ఇక మార్ఫింగ్ విషయానికొస్తే...ఇదొక సృజనాత్మక కళ. ఒక కళాకారుడు సప్తవర్ణాల సమ్మేళనంతో ఒక వర్ణ చిత్రాన్ని రూపొందించినట్లుగానే ఒక యానిమేటర్ తన సృజనాత్మకతకు సాంకేతికతను జోడించి ఒక యానిమేషన్ సృష్టిస్తాడు. విశ్వామిత్రుడు త్రిశంకు స్వర్గాన్ని సృష్టించాడని చెపుతారు. అదెంతవరకు నిజమో తెలియదు కాని.. అక్షరాలా అదే త్రిశంకు స్వర్గాన్ని ఒక యానిమేటర్ సృష్టించగలడు. అందుకు అవసరమైన అనేక సాఫ్ట్‌వేర్లు ప్రస్తుతం అందుబాటులో వున్నాయి. ఇంతటి అద్భుత కళాసృష్టి అప్పుడప్పుడు వక్రమార్గం పడుతోంది. సరదాగా చేసినా, కావాలని చేసినా అది ఎదుటి వారి జీవితాలపై బురద జల్లుతోంది. "మీ పైశాచిక ఆనందమే తప్ప మాకూ కుటుంబాలున్నాయని, ఈ ప్రభావం వారిపైనా పడుతుందని, ఇందరిని బాధించి మీరు సాధించేదేమిటని" ఓ ప్రముఖ తారామణి ఒక తెలుగు చానల్‌లో వాపోయింది. వెబ్‌సైట్లు, టీవీ చానళ్లలో వచ్చే ఈ మార్ఫింగ్ చిత్రాలను అద్భుతంగా రూపొందించగలుగుతున్నారంటే దానికి సాఫ్ట్‌వేర్ తోడ్పాటు ఎంతో ఉంది. 'ఫ్లాష్, 3డి మాక్స్, మాయ, ఓపెన్ సోర్స్'లో లభ్యమయ్యే బ్లెండర్ వంటి సాఫ్ట్‌వేర్లు అందుబాటులో వున్నాయి. వీటికి సహాయకారిగా వీడియో ఎడిటింగ్ కోసం ఆఫ్టర్ ఎఫెక్ట్స్, అడోబ్ ప్రీమియర్ వంటి అనేక సాఫ్ట్‌వేర్లు దోహదపడుతున్నాయి. వీటితోపాటు ఫోటోషాప్ అత్యంత కీలకమైన పాత్రను పోషిస్తోంది.

సృష్టికి ప్రతి సృష్టి చేయగల కళాస్రష్టలు తమ సృజనాత్మకతను వక్రమార్గంలో కాకుండా నలుగురికీ ఉపకరించేవిధంగా మలచిననాడు ఆ కళ ధన్యమవుతుంది.

-కె.ఎక్స్.రాజు

పాల పిట్ట

పాలపిట్ట సుమారు పావురమంత ఉంటుంది. తల, ముక్కు పెద్దగా ఉంటాయి. ఈ పక్షి గోధుమ రంగులో ఉంటుంది. తోక, పొట్ట భాగం లేత నీలి రంగులో ఉంటాయి. రెక్కలు లేత, ముదురు నీలిరంగులు కలగలిపినట్లు ఉంటాయి. ఎగిరేటప్పుడు ఈ రెక్కలు మెరుస్తున్నట్లుగా కనిపిస్తాయి. పంట భూముల్లో ఎక్కువగా కనిపిస్తాయి. కీటకాలు, పురుగులు, మిడతలు వీటి ఆహారం. పంటలను నాశనం చేసే పురుగులను తిని రైతుకు ఉపయోగ కారిగా ఉంటాయి. వీటి గుడ్లు తెలుపు రంగులో గుండ్రంగా ఉంటాయి. మగ పక్షి గాల్లో పల్టీలు కొట్టుకుంటూ ఎగురుతుంది. ఈ పక్షులు చెట్ల తొర్రల్లో గూడు కట్టుకుంటాయి. పాలపిట్టలు ఎప్పుడూ ఒకే రకంగా అరవవు. రకరకాలుగా అరుస్తూ, గాల్లో ఎగురుతుంటాయి.



త్రిభుజాలెన్ని?

నేస్తాలూ... కిందున్న చతురస్రంలో కొన్ని త్రిభుజాలున్నాయి. అవి మొత్తం ఎన్నున్నాయో లెక్కించి చెప్పండి.



ఆరు తేడాలు

పిల్లలూ... కిందున్న రెండు బొమ్మలు ఒకేలా ఉన్నాయి. కానీ వాటిలో ఆరు తేడాలున్నాయి. అవేంటో కనిపెట్టండి.





సాయం చేయరూ...!

బుజ్జాయిలూ... ఇక్కడున్న నానిగాడికి బాగా ఆకలిగా ఉందంట. లోపలేమో అరటిపండ్లు కనిపిస్తున్నాయి. తిందామంటే లోపలికి ఎలా వెళ్లాలో అర్థం కావట్లేదు. మరి సాయం చేయరూ.



నేర్చుకుందాం



చుక్కల్లో చిక్కిందెవరో?

పిల్లలూ... 1 నుండి 70 వరకు ఉన్న అంకెలను వరుసగా కలిపి చూడండి. అప్పుడు చుక్కల్లో చిక్కిందెవరో తెలిసిపోతుంది. ఆ వచ్చిన దానికి మంచి రంగులు వేసి చూడండి. భలేగా ఉంటుంది.

బొమ్మలో తమాషా

హాయ్... ఈ బొమ్మలో ఏం కనిపిస్తున్నాయి. ఓ అమ్మాయి తలమీద బుట్టని పెట్టుకుంది కదా. ఈ పుస్తకాన్ని కాస్త దూరంగా పెట్టుకుని చూడండి. ఇప్పుడేం కనిపించిందో చెప్పండి.

ఎన్ని రోజులో...



ఒక నత్త 15 మీటర్ల ఎత్తున్న చెట్టుపైకి పాకాలి. ప్రతిరోజు అది ఐదు మీటర్ల ఎత్తు పాకుతుంది. కానీ రాత్రి నిద్రపోయినప్పుడు దానికి తెలియకుండానే 4 మీటర్లు కిందికి జారిపోతుంది. ఈ విధంగా వెళ్లే ఆ నత్తకి పూర్తిగా చెట్టు పైకి ఎక్కడానికి ఎన్ని రోజులు పడుతుంది?

ఎలాగబ్బా...!

ఇద్దరు తండ్రులు, ఇద్దరు కొడుకులు కలిసి మూడు కోడిగుడ్లు తిన్నారు. కాని ప్రతి ఒక్కరు ఒక పూర్తి గుడ్డు తిన్నారు. ఎలా?

జవాబులు : త్రిభుజాలెన్ని? : మొత్తం త్రిభుజాలు 76.

ఎలాగబ్బా...!: అక్కడ వున్నది ముగ్గురే. తాత, తండ్రి, కొడుకు. వారిలో ఇద్దరు తండ్రులున్నారు. ఇద్దరు కొడుకులున్నారు.ఒక మనవడున్నాడు.

ఎన్ని రోజులో...: 11 రోజులు పడుతుంది. మొదటి పది రోజులు పది మీటర్ల చొప్పున పాకుతుంది. పదకొండో రోజు ఐదు మీటర్ల పాకుతుంది. చెట్టుపైకి చేరుతుంది.

మాటల కోట - 43

రూపకల్పన : కర్లపాలెం

1		2		■	3	4		
■	■		■	5	■		■	■
6	7	■	8			■	9	10
11		12	■		■	13		
■	■	14		■	15		■	■
16	17		■	18	■	19	20	21
22		■	23			■	24	
■	■	25	■		■	26	■	■
27				■	28			

అడ్డం :

1. ఉన్నవ లక్ష్మీనారాయణ పంతులుగారి ప్రసిద్ధ నవల (4)
3. ఎడమ భాగం (4)
6. కుండ (2)
8. పట్టంటే దీనిదే పట్టు (3)
9. కాకరాపల్లి లో వేడి (2)
11. అన్న భార్య (3)
13. సినిమా హీరో నాగార్జున భార్య. ఈమె కూడా ఒకప్పటి సినిమా నాయికే (3)
14. శరణంలోనూ యుద్ధం ఉంది (2)
15. నిస్సహాయురాలైన స్త్రీ (2)
16. అనగనగా ఇది అతిశయిస్తుందని వేమనవాదం (3)
19. కవి అల్లేది (3)
22. జారుముడిలో ఊరగాయ భద్రం చేసేది (2)
23. అంతరిక్ష క్షిపణి (3)
24. తాడిచెట్టు కింద కూర్చుని పాలు తాగినా ఇదే తాగాడనుకుంటారు. అటునుండి (2)
27. ప్రసిద్ధ గాయకుడు వెంకటేశ్వరరావుగారి ఇంటిపేరు (4)
28. గిరీశం సృష్టికర్త (4)

నిలువు :

2. రెండు అయిదులు (2)
4. వేసవిలో మాత్రమే కనిపించే మంచి వాసనగల పూలు (2)
5. "నా అంతటి వాడిని నేనే" అంటాడు ముళ్లపూడి వారి చిచ్చరపిడుగు (3)
6. అక్క మొగుడు (2)
7. ఏరు (2)
9. ఫుల్‌స్టాప్ కాదు. విరామం తీసుకోండి. చివరి అక్షరానికి దీర్ఘం లేదు సుమా (2)
10. మగవారైనా కనగలిగేది (2)
12. నాడి (3)
13. ఇది తెలియజేయడానికి చిన్నపిల్లలు బుంగమూతి పెడతారు (3)
16. టూజీ స్పెక్ట్రం అనంగానే ముందు గుర్తొచ్చే దొర (2)
17. అం'గడి'లో దొరికే కోట (2)
18. ఇప్పుడు జరుగుతున్న ప్రపంచకప్ టోర్నీ ఈ ఆటదే (3)
20. వీలునామా వ్యవహారిక నామం (2)
21. డ్యామిట్ 'కత' అడ్డం తిరిగింది! (2)
25. కింద నుండి పైకి వచ్చే సంవత్సరం (2)
26. పొదుగాటి పన్ను (2)

మాటలకోట - 42జవాబు

1 జ	2 టా	■	3 పా	రు	4 డు	■	5 వే	6 ప
7 వా	టా	■	డ	■	చె	■	8 స	బ్బు
బు	■	■	9 రు	10 జు	వు	■	వి	■
■	11 జా	12 తా	■	త్తు	■	13 పు	■	14 ఆ
15 ఆ	న	క	ట్ట	■	16 న	ల్ల	17 ధ	నం
ట	■	ట్టు	■	18 పా	■	16 న	ర	■
■	19 ప	■	20 సి	పి	21 యం	■	■	22 జే
23 ము	న్ను	■	ద్ధాం	■	త్ర	■	24 ఎం	పి
25 ము	లు	■	26 తం	త్ర	ము	■	27 పె	సి

ఎలుక స్వయంవరం



చాలా ఏళ్ల కిందటి మాట. అడవిలో ఓ ఎలుక ఉండేది. అది చాలా అందమైనది కూడా. దాన్ని పెళ్లి చేసుకోడానికి అనేక జంతువులు ప్రయత్నించాయి. కానీ అది వారెవ్వరినీ లక్ష్యపెట్టలేదు. "నా అందానికి, నా శక్తికి మీరు సరితూగరు. నాకు కాబోయే భర్త అందరికంటే బలవంతుడు, ధైర్యవంతుడు అయి ఉండాలి" అంది. అనడమే కాదు ఏకంగా స్వయంవరమే ప్రకటించింది. అందమైన ఆ ఎలుకను పెళ్లి చేసుకోడానికి అడవిలోని జంతువులన్నీ స్వయంవర మండపానికి వచ్చాయి. ముందు కుందేలు వచ్చింది.

"నేను చాలా అందంగా వుంటాను. అంతే కాదు, ఒక గంతు ఇక్కడ వేశానంటే మరో గంతు పదడుగుల దూరంలో వేస్తాను. నా అంత వేగంగా ఏ జంతువూ పరిగెత్తలేదు. కనుక నేను ఎలుకను పెళ్లి చేసుకుంటాను" అంది. వెంటనే నక్క అమాంతం దానిమీద దూకి చంపేసింది.

"నేనే విజేతను. నన్ను వివాహమాడు" అంది నక్క. కానీ దాని మాటలు పూర్తయ్యేలోగానే కుక్క దాని మీదకి దూకి చంపేసింది. "దాని కంటే నేను బలవంతురాలిని. నన్ను వివాహమాడు" అంది కుక్క.

ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న తోడేలు కుక్క మీదికి దూకి దాన్ని చీల్చేసింది. "నేను కదా బలవంతురాలిని" అంది తోడేలు.

"నా కంటేనా" అంటూ చిరుతపులి దానిమీద దాడిచేసి చంపేసింది.

"నాకంటే బలవంతురాలైన జంతువు, నా అంత వేగంగా పరిగెత్తే జంతువు మరొకటి లేదు. కనుక నాకే ఎలుకను వివాహమాడే అర్హత ఉంది' అంది చిరుతపులి.

"నువ్వు నాకంటే బలవంతురాలివా" అని ఏనుగు ముందుకొచ్చింది. రెంటికీ కొద్దిసేపు యుద్ధం జరిగింది. ఏనుగు తనకు చిక్కిన పులిని తొండంతో అమాంతం ఎత్తి గిరగిరా తిప్పి నేలకేసి కొట్టింది. పులి కిమ్మనకుండా చచ్చూరుకుంది. "ఆకారంలోనైనా, బలంలోనైనా నన్ను మించిన జంతువు ఈ అడవిలోనే లేదు. నిన్ను పెళ్లాడే అర్హత నాకు మాత్రమే ఉంది" గర్వంగా అంది ఏనుగు.

"ఆకారం ఉంటేనే సరిపోదు. శక్తియుక్తులు కూడా కావాలి. నన్ను చూస్తేనే మీ ఏనుగుల మంద పారిపోతుంది. నా కంటే నువ్వు గొప్పదానివా? నాతో తలపడు చూద్దాం" అంది ముందుకొచ్చిన సింహం.

రెండింటికీ ఘోర యుద్ధం జరిగింది. అవి పెట్టే కేకలకు అడవి దద్దరిల్లింది. ఎలుక వాటి పోట్లాట చూసి భయపడింది. చచ్చిపడున్న జంతువులు, ధారలుగా కారుతున్న జంతువుల రక్తం, వాటి పెడబొబ్బలు చూసిన ఎలుకకు కళ్లు తిరిగి స్పృహతప్పి పడిపోయేంత పనైంది. పూలదండ పక్కన పడేసి గబగబా కలుగులోకి పరుగెత్తింది.

చాలా సేపటికి ఏనుగును సింహం చంపేసింది. విజయగర్వంతో వికటాట్టహాసం చేస్తూ, అడవి దద్దరిల్లేలా అరిచింది. ఆ కేకలకు మరింత బిగుసుకు పోయింది బొరియలోని ఎలుక. ఏనుగును చంపిన ఉత్సాహంతో ఎలుక కోసం ఆ ప్రదేశమంతా గాలించింది. కానీ ఎక్కడా ఎవరూ కనిపించలేదు. గట్టిగా కేకలు పెట్టింది. ఆ ప్రదేశాన్నంతా ధ్వంసం చేసింది. ఎలుక ఎక్కడా కనిపించక అడవిలోకే పారిపోయుంటుందని, వెనుదిరిగి వేగంగా అడవిలోకి పరుగెత్తింది.

ఎప్పటి నుండో ఆ ఎలుకను పెళ్లి చేసుకోవాలని ఓ మగ ఎలుక అనుకునేది. స్వయం వరానికి వచ్చి చాటున నక్కిన ఆ మగ ఎలుక అడవిలోకి వెళ్లిన సింహాన్ని చూసి వెలుపలికి వచ్చింది. చచ్చిన జంతువు రక్తం మూతికి రాసుకుని ఆడ ఎలుక వెళ్లిన రంధ్రంలోకి జొరబడింది.

"జంతువులన్నింటికంటే నేను బలవంతురాలిని. ఏనుగును చంపిన సింహం మీద నేనే పోట్లాడాను. అది నాతో గెలవలేక భయంతో అడవిలోకి పారిపోయింది. ఇంక నేను తప్ప ఈ స్వయంవర మండపంలో ఎవరూ లేరు. కావాలంటే వెళ్లి చూడు" అంది ఆ మగ ఎలుక. వెంటనే ఆడ ఎలుక కలుగు వెలుపలికి వచ్చి చూసింది. అక్కడ అన్నీ చచ్చిపడున్న జంతువులే కనిపించాయి. కానీ సింహం కనిపించలేదు.

సిగ్గుతో తల వంచుకుని "నువ్వు నిజంగా బలశాలివే. సింహం వద్దు ఏం వద్దు. నువ్వే నాకు తగిన జోడి" అని పూలదండ అందుకుని మగ ఎలుక మెడలో వేసింది. అవి రెండూ అదే కలుగులో కాపురం పెట్టాయి. సింహం ఎలుక కోసం అడవంతా గాలిస్తూనే ఉంది. ఓసారి డజనుమంది పిల్లలతో సింహానికి ఎదురుపడింది ఆ ఎలుక. కానీ సింహం దాన్ని గుర్తుపట్టలేదు. "నేను వరించిన ఎలుకకు పిల్లలు లేరు" అనుకుంటూ వెదకడానికి వెళ్లిపోయింది.

- పుప్పాల కృష్ణమూర్తి

రంగుల పండుగ

హోలీ పండుగ పేరు చెబితేనే ఉత్సాహం ఉరకలు వేస్తుంది. మరి రంగుల పండుగకు ఆ మాత్రం సందడి లేకపోతే ఎలా! ఉత్తర భారతదేశంలో అత్యంత ఆనందోత్సాహాలతో జరుపుకునే పండుగ ఇది. చేతి నిండా రంగులు తీసుకొని హితులు, సన్నిహితులు, స్నేహితులు, బంధువుల మీద ఉత్సాహంగా చల్లుకునే పండుగ. వివాహమైన తొలి సంవత్సరం వచ్చే హోలీ పండుగను ఎంతో వేడుకగా జరుపుకుంటారు. ఈరోజున పెద్దలు కూడా పిల్లలైపోయి గెంతుతూ... తుళ్లుతూ... పరుగెడుతూ రంగులు చల్లుకుంటారు. పండుగకు కొద్దిరోజుల ముందే మార్కెట్లు రంగులతో నిండిపోయి ఒక రకమైన ఉత్తేజాన్ని నింపుతాయి. ఆ సందర్భంగా కెమెరాలో బంధించిన చిత్రమాలికను చిత్తగించండి.